# ప్రజాశక్తి

మంగళవారం 14 మార్చి 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు


# కొన్ని రావాలి.. కొన్ని తీరాలి..

- సమస్యల ప్రస్తావనకు ప్రజాప్రతినిధుల సన్నద్ధం
- నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించిన వివిధ అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. కొన్ని ప్రాజెక్టులకు అనుమతులు రావాల్సి ఉండగా, మరికొన్ని పనులకు నిధులు రావాల్సి ఉంది. ఇంకొన్ని సమస్యలు తీరాల్సి ఉంది. వీటితోపాటు జిల్లాలో నెలకొన్న పలు సమస్యలకు ఈ సమావేశాల్లో కొంత మేరకైనా పరిష్కారం లభిస్తుందా లేక గతంలో మాదిరిగా ఇతర అంశాలపై పరిమితమై సమావేశాలు ముగుస్తాయా అనేది చర్చనీయాంశంగా మారింది. వైసిపి ప్రభుత్వ హయాంలో పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలు ఇవే చివరి కావడంతో కొన్ని సమస్యలైనా పరిష్కారం పొందేందుకు ప్రజా ప్రతినిధులు ప్రయత్నించాల్సి ఉంది.

రాజధాని అమరావతి అంశంపై ఈనెల 28న సుప్రీంకోర్టులో విచారణ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇదే అంశంపై ఈ సమావేశాల్లో చరిచస్తారా? లేదా? అనేది ఆసక్తిగా మారింది. అమరావతిని రాజధానిగా కొనసాగించాలని, సిఆర్‌డిఎ రద్దు చెల్లదని గతేడాది మార్చి 3న రాష్ట్ర హైకోర్టు తీర్పు ఇచ్చిన తరువాత 3 రాజధానులపై సమగ్ర బిల్లు తీసుకువస్తామని పలుమార్లు మంత్రులు ప్రకటించినా సుప్రీం కోర్టులో విచారణ జరగాల్సి ఉండటంతో ప్రభుత్వం ఆచితూచి స్పందించే అవకాశాలు ఉన్నాయి. అమరావతి అభివృద్ధిలో టిడిపి ప్రభుత్వ హయాంలో జరిగిన వైఫల్యాలను ఎండగడుతూ వికేంద్రీకరణకు కట్టుబడి ఉన్నామని శాసనసభలో వైసిపి ప్రజా ప్రతినిధుల చేత మాట్లాడించే అవకాశం ఉందని సీనియర్ ప్రజా ప్రతినిధి ఒకరు అభిప్రాయపడ్డారు.

మరోవైపు జిల్లాలో నెలకొన్న పలు సమస్యలపై అటు శాసన సభ, ఇటు మండలిలో చర్చించే అవకాశం ఉందంటున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అనేక ప్రాజెక్టులపై ప్రజా ప్రతినిధులు ప్రస్తావించనున్నారు. గుంటూరులో 2019లో నిలిచిపోయిన భూగర్భ డ్రైనేజి పనులు తిరిగి ప్రారంభించడం, గుంటూరు ఛానల్ విస్తరణ, పొడిగింపునకు నిధులు విడుదల, జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు చేపట్టిన వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టుకు నిధులు విడుదల తదితర అంశాలు ప్రస్తావించనున్నారు. వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టుతో నర్సరావుపేట లోక్‌సభ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గాలలో తాగునీటి ఎద్దడి నివారణకు శాశ్వత ప్రాతిపదికన నిర్మాణాలు చేసేందుకు రూ.2600 కోట్లతో ప్రతిపాదించిన వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టుల నిర్మాణం కాగితాలకే పరిమితమైంది. రహదారులు అధ్వానంగా మారాయి. నిధుల కొరత, కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం వల్ల పనులు జరగడం లేదని చెబుతున్నారు. వరికపూడిసెలకు కేంద్రం తక్షణమే అనుమతివ్వాలని అసెంబ్లీలో చర్చించేందుకు కొంతమంది ప్రజా ప్రతినిధులు సిద్ధమయ్యారు. ఇటీవల జిల్లా పరిషత్‌లో ఇదే తీర్మానం చేశారు. ప్రస్తుతం పసుపు రైతులకు మద్దతు ధరలు లభించడంలేదు. శనగలు, అపరాల ధరలు కూడా నిరాశజనకంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన మద్దతు రాక అపరాల సాగు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ అంశాలను ప్రజాప్రతి నిధులు చర్చించాలని రైతులు కోరుతున్నారు.

# రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

- హాజరు కానున్న 98,682 మంది విద్యార్థులు
- ఒక్క నిముషం ఆలస్యమైనా అనుమతి లేదు
- పేపర్ చించితే మాల్‌ప్రాక్టీస్

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో రేపటి నుంచి నిర్వహించనున్న ఇంటర్ థియరీ పరీక్షలు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 134 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ జనరల్, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి ప్రథమ సంవత్సరం విద్యార్థులు 49,228 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 49,454 మంది, మొత్తం 98,682 మంది హాజరు కానున్నారు. గుంటూరు జిల్లాలో 73, పల్నాడు 44 కేంద్రాలు, బాపట్లలో 17 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్ష నిర్వహిస్తారు. అర్ధగంట ముందే పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తారు. నిర్ధేశిత సమయం దాటి ఒక్క నిముషం ఆలస్యమైనా అనుమతి ఉండదని, విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఆర్ఐఒ సునీత చెప్పారు. విద్యార్థులు హాల్‌టిక్కెట్, ఫొటో గుర్తింపు కార్డు తప్ప సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువులూ తీసుకురాకూడదు. విద్యార్థులకు ఇస్తున్న ఆన్సర్ బుక్‌లెట్‌లో పేజీలను చించితే పాల్‌ప్రాక్టీస్ కింద కేసు బుక్ చేస్తామని అధికారులు వెల్లడించారు. గతం నుండి ఈ నిబంధన ఉన్నా గతేడాది అటువంటి ఘటనలు ఉండటంతో ఈ ఏడాది అంశాన్ని ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారు. కావున ఆన్సర్ బుక్‌లెట్‌ను చించకుండా పరీక్ష రాయాల్సి ఉంటుంది. విద్యార్థులతోపాటు, ఇన్విజిలేటర్లకూ సెల్‌ఫోన్లకు అనుమతి లేదు. చీఫ్ సూపరింటెండెంట్‌లకు మాత్రం ఇంటర్ బోర్డు అందించిన బేసిక్ ఫోన్ మాత్రమే ఉంటుంది. పరీక్షలను పకడ్బందీగా పర్యవేక్షించటానికి ఐదు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, ఐదు సిట్టింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పరీక్షకు సంబంధించి సందేశాలు, సమస్యలు ఏమైనా ఉంటే ఇంటర్ విద్య ఆర్ఐఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన (0863-2228528) కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని అధికారులు తెలిపారు.

### ఏర్పాట్లు పూర్తి అయ్యాయి : ఆర్ఐఒ సునీత

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా కలెక్టర్ సారధ్యంలో రెవెన్యూ, విద్యుత్, ఆర్టీసి, మెడికల్ అండ్ హెల్త్ తదితర శాఖల సహకారంతో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నాము. విద్యార్థులు ఆందోళన చెందకుండా ముందుగానే పరీక్షా కేంద్రాన్ని సందర్శించి, పరీక్ష రోజున సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి.

అధికారులతో మాట్లాడుతున్న మేయర్ మనోహర్‌నాయుడు

# జిఎంసి వార్షిక బడ్జెట్‌పై మేయర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

నగరపాలక సంస్థ 2023-24 సంవత్సరానికి సంబంధించి రూపొందించిన బడ్జెట్ గుంటూరు నగరాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు. వార్షిక బడ్జెట్‌పై మేయర్ అధ్యక్షతన, ఆయన ఛాంబర్‌లో వివిధ విభాగాధిపతులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిఎంసి ఆదాయ వ్యయాలు, బడ్జెట్ అంచనాలపై అధికారులతో చర్చించారు. మేయర్ మాట్లాడుతూ నగరంలో ప్రతి ప్రాంతం సమగ్రంగా అభివృద్ధి చెందేలా, ప్రతిఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన ఆహ్లాదకరమైన వాతావరణం అందించేలా కృషి చేస్తామన్నారు. ఆదాయం పెంపుదలకు, కొత్త ఆదాయ మార్గాల అన్వేషణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిఎంసికి ఆదాయం ప్రదానంగా ఆస్తి పన్ను వసూళ్ల ద్వారానే వస్తుందన్నారు. బడ్జెట్లో తాగునీరు, పారిశుధ్యంతో పాటు నగరంలో పచ్చదనం పెంపుకు, రోడ్ల విస్తరణకు ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు. సమావేశంలో అదనపు కమిషనర్ పెద్ది రోజా, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, ఇఒఎ నాగేంద్ర కుమార్, ఎస్ఇ భాస్కరరావు, సిపి మూర్తి, సిఎంహెచ్ఒ విజయలక్ష్మి, డిసిపి కోటయ్య, ఎంహెచ్ఒ భానుప్రకాష్ పాల్గొన్నారు.

# పెద్ద సంస్థలు.. పన్నునామాలు..

- పేరుకుపోతున్న కార్పొరేట్ల పన్ను బకాయిలు
- విద్యార్థుల నుంచి రూ.లక్షలు వసూలు
- నోటీసులను ఖాతరు చేయని విట్, ఎస్ఆర్ఎం
- లేబర్ సెస్సుపై కార్మిక శాఖ మీనమేషాలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

కార్పొరేట్ రంగంలోని విద్యా, వైద్య సంస్థలు పన్నులు ఎగవేతకు పాల్పడుతున్నా జిల్లా అధికారులు పట్టిపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. సాధారణ ప్రజల నుంచి ఆస్తి పన్నులను ముక్కుపిండి వసూలు చేస్తున్న పంచాయతీ, కార్మిక శాఖ అధికారులు కార్పొరేట్ సంస్థలకు మాత్రం మినహాయింపు ఇస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 1025 గ్రామ పంచాయతీల నుంచి 2021-23 ఆర్థిక సంవత్సరంలో రూ.50 కోట్ల వరకు బకాయిలున్నాయి. వీటి వసూలులో కొన్ని పంచాయతీ కార్యదర్శులు, పాలక వర్గాలు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. పంచాయతీలకు ఆదాయం లేదని చెబుతూనే రావాల్సిన పన్ను బకాయిలను పలు పంచాయతీలు వసూలు చేయడం లేదని అధికారులు చెబుతున్నారు.

ప్రధానంగా రాజధాని ప్రాంతంలోని రెండు కార్పొరేట్ విద్యా సంస్థలు గత ఆరు సంవత్సరాలుగా పన్నులు చెల్లించడంలేదు. అధికారులు వత్తిడి చేస్తే కొంత చెల్లించడం, తరువాత పెండింగ్‌లో పెట్టడం పరిపాటిగా మారింది. రాజధాని ప్రాంతంలోని విట్, ఎస్ఆర్ఎం విద్యా సంస్థలు ఐదేళ్లుగా ఇళ్ల పన్ను బకాయిలు చెల్లించడంలేదు. ఈ బకాయిల వసూలుపైలో నెలకొన్న నిర్లక్ష్యంపై సోమవారం జిల్లా కలెక్టరు నిర్వహించిన స్పందనలో గుంటూరుకు చెందిన అప్పసాని చంద్రశేఖర్ ఫిర్యాదు చేశారు. ఒక్కో విద్యా సంస్థ రూ.3 కోట్ల వరకు బకాయిలున్నా పట్టించుకోవడంలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై జిల్లా పంచాయతీ అధికారిని కలెక్టర్ వివరణ కోరారు. ఇప్పటికే తగిన ఆదేశాలు ఇచ్చామని జిల్లా పంచాయతీ అధికారి కేశవరెడ్డి వివరణ ఇచ్చారు.

పూర్తి కార్పొరేట్ హంగులతో పనిచేస్తూ ఒక్కో విద్యార్థి నుంచి ఏడాదికి రూ.3 లక్షల వరకు ఫీజు వసూలు 2లో

కేక్‌ను కట్ చేస్తున్న రామ్‌చరణ్ అభిమానులు

# సత్తెనపల్లిలో ఆస్కార్ సంబరాలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలోని నాటునాటు పాటకు ఆస్కార్ అవార్డు లభించిన సందర్భంగా పట్టణంలోని సాయికృష్ణ థియేటర్ వద్ద నటుడు రామ్‌చరణ్ అభిమానులు సంబరాలు చేసుకున్నారు. సోమవారం టపాసులు కాల్చి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో సోమిశెట్టి సుబ్రహ్మణ్యం, ఖాజా, పోతంశెట్టి వెంకటేష్, శిరిగిరి మణికంఠ, రెహమాన్, టైలర్ రాక్ శివ, శిరిగిరి నరేంద్ర, రాయుడు బాలకృష్ణ, చిన్ని, అనిల్, బాజీ, రఫీ, మోహన్, అల్లంశెట్టి ప్రసాద్, దిలీప్, బాబాయ్ శివ, శేఖర్, హరీష్ పాల్గొన్నారు.

## నేడు నులిపురుగుల నివారణ దినం

8లో

## నల్లబ్యాడ్జీలతో విధులకు ఉద్యోగులు

**ప్రజాశక్తి-గుంటూరు:** ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎపి జెఎసి అమరావతి పిలుపు మేరకు ఐదవ రోజు ఉద్యమ కార్యాచరణలో భాగంగా సోమవారం పలు శాఖల ఉద్యోగులు నల్లబాడ్జీలు ధరించి, విధులకు హాజరై నిరసన తెలిపారు. గుంటూరులో స్పందన కార్యక్రమానికి హాజరైన ఉద్యోగులు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. హార్టికల్చర్, సెరీ కల్చర్, మార్కెటింగ్ కార్యాలయాల్లో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించారు. జెఎసి జిల్లా ఛైర్మన్ కె.సంగీతరావు, జిల్లా జనరల్ సెక్రెటరీ పి.ఎ.కిరణ్‌కుమార్, హనుమంతరావు, అవుట్‌సోర్సింగ్ రాష్ట్ర నాయకులు భాను తదితరులు వివిధ కార్యాలయాల్లో ఉద్యోగుల్ని కలిసి సంఘీభావం తెలిపారు.

## పన్ను చెల్లించకుంటే వాహనాలు సీజ్

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

జిల్లాలో పన్నులు చెల్లించకుండా నడుపుతున్న వాహనాలను సీజ్ చేస్తామని గుంటూరు ఉప రవాణా కమీషనర్ షేక్ కరీం తెలిపారు. ఇప్పటికే సంబంధిత వాహనదారులను గుర్తించి నోటీసులు ఇచ్చామని సోమవారం ఆయన ప్రకటనలో తెలిపారు. సంబంధిత వాహన వివరాలను మోటార్ వాహన తనిఖీ అధికారులందరికీ అందించామన్నారు. గత నెల ఒకటో తేదీ నుంచి ఇప్పటివరకు 295 పన్నులు కట్టని వాహనాలు పై నమోదు చేశామన్నారు. ఈ ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయన్నారు. నోటీసులు అందుకున్న వారు స్వచ్ఛందంగా పనులు చెల్లిస్తే వాహన పన్నుతోపాటు కేవలం 50 శాతం జరిమానాతో ఆన్లైన్ ద్వారా పన్నును చెల్లించవచ్చు అని తెలిపారు. వాహనాల పన్ను చెల్లించని వాహనాలు తనిఖీలలో పట్టుబడితే అదనంగా 200 శాతం జరిమానా విధించటంతో పాటు వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. వాహన యజమానులు వారి యొక్క వాహనాలకు చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించి అధిక జరిమానాలకు గురికాకుండా ఉండాలన్నారు.

## క్రీడా పోటీల్లో వర్శిటీ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి - ఎఎన్‌యు**

మార్చి 9 నుండి 12 వరకు హిమాచల్ ప్రదేశ్ యూనివర్సిటీ అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల పవర్ లిఫ్టింగ్ మహిళల పోటీలలో విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పి జాన్సన్ తెలిపారు. చీరాల భారతి డిగ్రీ కళాశాల చెందిన విద్యార్థిని ఎస్ ద్వారక 76 కేజీలు ఈ భాగంలో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్స్ సాధించిందని చెప్పారు. పంజాబ్ యూనివర్సిటీలు చండీగర్‌లో మార్చి 10 నుండి 14 వరకు జరిగిన జిమ్నాస్టిక్స్ పురుషుల విభాగం పోటీలలో గుంటూరు ఏసీ కళాశాలకు చెందిన విద్యార్థి జి.నిత్య సంతోష్ కాంస్య పథకాన్ని సాధించగా అభినందనలు తెలిపారు.

## పెద్ద సంస్థలు.. పన్నునామాలు..

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్న విట్, ఎస్ఆర్ఎం కళాశాల నిర్వాహకులు పన్నులు చెల్లించకుండా ఏదో ఒక సాకుతో బకాయిలు రద్దు చేయించుకునేందుకు ఉన్నత స్థాయిలో వత్తిడి తెస్తున్నట్టు తెలిసింది. ఈ రెండు విద్యా సంస్థలు కొన్నేళ్లుగా కార్మిక శాఖకు రూ.లక్షల్లో లేబరు సెస్సు చెల్లించడం లేదు. అయినా కార్మిక శాఖాధికారులూ సాదా సీదాగా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. ఒక్కో విద్యా సంస్థ రూ.50 నుంచి రూ.70 లక్షల వరకు లేబరు సెస్సు బకాయిలు చెల్లించాల్సి ఉందని తెలిసింది. ఇదిలా ఉండగా జిల్లాలో డెల్టాలో 80 నుంచి 90 శాతం వరకు ఇళ్ల పన్నులు వసూలు అవుతుండగా గురజాల, నర్సరావుపేట డివిజన్లలో పన్ను బకాయిలు పేరుకుపోతున్నాయి. గుంటూరు డివిజన్‌లో 70 శాతం వరకు వసూలయ్యాయి.

# గాజు పెంకుతో గొంతు కోసుకున్న విద్యార్థిని

## బాలికకు సబ్ కలెక్టర్ పరామర్శ

**ప్రజాశక్తి-తెనాలి**

విద్యార్థిని అక్షయను పరామర్శిస్తున్న సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ

ఏడో తరగతి చదువుతున్న హాస్టల్ విద్యార్థిని గాజుపెంకుతో గొంతుపై కోసుకుంది. అప్రమత్తమైని సిబ్బంది ఆసుపత్రికి తరలించారు. స్వల్ప గాయమే కావటంతో అంతా ఊపరిపీల్చుకున్నారు. సేకరించిన వివరాల ప్రకారం దుగ్గిరాల గ్రామానికి చెందిన విద్యార్థిని తిరువీధుల అక్షయ స్థానిక చంద్రబాబునాయుడు కాలనీలోని ఎస్టీ బాలికల గురుకుల సంక్షేమ పాఠశాల్లో ఏడోతరగతి చదువుతోంది. సోమవారం సాయంత్రం వసతి గృహంలోనే గాజుపెంకుతో గొంతుపై కోసుకుంది. గమనించిన సహ విద్యార్థులు ప్రిన్సిపాల్, హాస్టల్ హౌస్ ఇన్‌చార్జికి సమాచారం ఇవ్వటంతో బాలికను తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతోను, వసతిగృహ సిబ్బంది, సంబంధిత అధికారులతో మాట్లాడారు. అయితే వసతిగృహంలో ఉండటం ఇష్టంలేక ఇటీవల గోడదూకి పారిపోయే ప్రయత్నం చేసిందని ప్రిన్సిపల్ డాక్టర్ బండి విజయకుమార్ తెలిపారు. బాలికకు ఎలాంటిప్రమాదమూ లేదని, విషయం బాలిక తల్లికి, సబంధిత అధికారులకు తెలియజేసినట్లు వెల్లడించారు. ఘటనపై స్పందించిన సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ మధు కూడా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించారు. బాలిక, ఆమె తల్లి, వసతిగృహ అధికారులను విచారించామని, కేవలం ఇంటికి వెళ్లిపోవాలన్న కోరకతోనే ఘటనకు పాల్పడిందన్నారు. అయితే బాలికకు సైకియాట్రిక్ ట్రీట్‌మెంట్ ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

## ఎర్రగుంట్లపాడులో సురేష్‌కుమార్ ప్రచారం

**ప్రజాశక్తి - ఫిరంగిపురం**

మండంలోని ఎర్రగుండ్లపాడులో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి షహేలా నర్గీస్ సలీం, సర్పంచ్ టి.కేశవరావు, జెడ్‌పిటిసి కె.రేణమ్మ, ఎంపిటిసి పి.స్వాములు, నాయకులు ఎం.శివరామిరెడ్డి, అప్పిరెడ్డి, ఎస్‌ఐ ఎం.లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

## రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా జాన్ బాధ్యతలు

**ప్రజాశక్తి-తెనాలిరూరల్**

మండల తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా యు.జాన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కలెక్టరేట్ నుంచి ప్రమోషన్‌పై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ రెవిన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన షేక్ కరిముల్లా డిఎస్‌వో కార్యాలయానికి సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ అయ్యారని తహశీల్దార్ కె.రవిబాబు తెలిపారు. ఆర్‌గా బాధ్యతలు స్వీకరించిన జాన్‌ను సహెూధ్యోగులు స్వాగతించారు.

## ప్రతి ఒక్క విద్యార్థికీ హాల్ టిక్కెట్ ఇవ్వాలి

**ప్రజాశక్తి-తాడేపల్లి**

కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజులతో సంబంధం లేకుండా ప్రతి ఒక్క విద్యార్థికి హాల్ టిక్కెట్ ఇవ్వాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్ కోరారు. ఆ మేరకు రాష్ట్ర నాయకులు సోమవారం తాడేపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ ఎంవి శేషగిరిబాబుకు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు పెండింగ్‌లో ఉన్న ఫీజులు కడితేనే హాల్ టిక్కెట్లు ఇస్తానడం సరికాదన్నారు. హాజరుశాతంతో సంబంధం లేకుండా హాల్‌టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు శివరాం,అయ్యప్ప పాల్గొన్నారు

## దాడి కేసులో నిందితుడిని అరెస్ట్ కోసం ఆందోళన

**ప్రజాశక్తి-తెనాలి**

కొలకలూరు సర్పంచ్ డాక్టర్ చొప్పర ప్రీతి తనపై దాడి జరిగినట్లు ఇచ్చిన పిర్యాదుపై పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, నిందితుడిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆద్వర్యంలో రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట సర్పంచ్ కుటుంబ సభ్యులు సోమవారం ఆందోళన చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఉన్నం ధర్మారావు మాట్లాడుతూ నిందితుడికి స్థానిక ఎమ్మెల్యేల అండదండలున్నాయని ఆరోపించారు. గ్రామ సర్పంచ్, అందులోనూ మహిళపై పోలీసుల సాక్షిగా దాడి జరిగినా నిర్లక్ష్యంగా వ్యవహరించటమేమిటని ప్రశ్నించారు. తక్షణమే నిందితుడిని అరెస్ట్ చేయకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని కుటుంబ సభ్యులు హెచ్చరించారు.

**నిందితుడిని అరెస్ట్ చేశాం:ఎస్‌ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు**

సోమవారం నిందితుడు పొన్నెకంటి రమేష్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు స్పందించారు. ఘటనకు కారణమైన స్థలాన్ని ఆయన పరిశీలించారు. స్థానికులను విచారించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సర్పంచ్‌ను కలిశారు. ఘటనకు సంబంధిచిన వివరాలు ఆమె ద్వారా తెలుసుకున్నారు. ఈ కేసులో పోలీసుల అలసత్వం లేదని, చట్టప్రకారం అన్ని చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. కేసు విచారణలో ఉండగా సోషల్ మీడియాలో పరస్పరం పోస్టులు పెట్టడం సరైంది కాదని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఇరు వర్గాలను హెచ్చరించారు.



విద్యార్థులను అభజనందిస్తున్న లావు రత్తయ్య, శ్రీ కృష్ణదేవరాయలు

## అమెరికాలో ఇంటర్న్‌షిప్‌నకు విజ్ఞాన్ విద్యార్థులు

**ప్రజాశక్తి-గుంటూరు**

వడ్లమూడి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు అమెరికాలోని ప్రముఖ అడ్వాన్స్డ్ ఫార్మసీ హాస్పిటల్స్‌లలో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసబాబు తెలిపారు. ఫార్మా-డి 6వ సంవత్సరం విద్యార్థులు ప్రశాంత్‌బాబు, నాగేంద్ర, హారిక అమెరికాలోని ప్రముఖ హాస్పిటల్స్‌లో ఈనెల 20 నుంచి వచ్చేనెల ఏప్రిల్ 21వ తేదీ వరకూ జరిగే 4 వారాల అడ్వాన్స్డ్ ఫార్మసీ ప్రాక్టీస్ ఎక్సిపెరిమెంటల్ ట్రైనింగ్ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారని తెలియజేసారు. అలాగే ఈ ముగ్గురు ఏప్రిల్ 13,14 తేదీలలో ఓహియోలోని యూనివర్సిటీ ఆఫ్ ఫిండ్లేలో జరగనున్న 5వ సంవత్సరం ఫార్మా-డీ సింపోసిజమ్ ఫర్ స్కాలర్‌షిప్ అండ్ క్రియేటివిటీ కాన్ఫరెన్స్‌లో తమ రీసెర్చ్ ప్రాజెక్ట్‌లను ప్రజెంట్ చేయడానికి కూడా ఎంపికయ్యారని వెల్లడించారు. అదే విధంగా కళాశాలకు చెందిన 5వ సంవత్సరం విద్యార్థులు యూఎస్ఏలోని అరిజోనాలో మార్చి 24 నుంచి 27 వరకు నిర్వహించే అమెరికన్ ఫార్మాసిస్ట్స్ అసోసియేషన్ యాన్యువల్ కన్వెన్షన్‌లో రెండు పేపర్లు ప్రచురించడానికి అనుమతి లభించిందన్నారు. ఆయా విద్యార్థులను విజ్ఞాన్స్ ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్‌ఛైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసబాబు తదితరులు అభినందించారు.

## నాటు నాటు పాటకు అస్కార్ రావడంపై హర్షం

**ప్రజాశక్తి-తాడేపల్లి**

ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని 'నాటు నాటు..' సాంగ్‌కు అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆస్కార్ అవార్డు పొందడం భారతీయ సినిమా ముఖ్యంగా, తెలుగు సినిమాకు దక్కిన అరుదైన గౌరవమని ఉండవల్లికి చెందిన సినీనటులు, దర్శకులు గాదె నాగభూషణం సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచ వ్యాపితం చేసిన దర్శకుడు రాజమౌళి, హీరోలు జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్, గీత రచయిత చంద్రబోస్,సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి, గాయకులు కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్, కొరియో గ్రాఫర్ ప్రేమ్ రక్షిత్, సినిమా టీమ్‌కు అభినందనలు తెలిపారు.

## కోనసీమ నుండి అమరావతికి పాదయాత్ర

**ప్రజాశక్తి-తాడేపల్లి**

అమరావతినే ఏకైక రాజధానికి కొన సాగించాలని కోరుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుండి 250 కిలోమీటర్ల పాదయాత్ర చేసుకుంటూ టిడిపి మహిళా నాయకురాలు శ్రీవాణి సోమవారం తాడేపల్లి చేరుకుంది. కోనసీమ జిల్లా మండపాడు నుండి బయలుదేరిన శ్రీవాణి సోమవారం కనకదుర్గమ్మ వారధి దాటి తాడేపల్లిలోకి రావడంతో స్థానికులు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. బి.రామకృష్ణ, ఎ.కుసుమ, పార్టీ నాయకులు పలువురు స్వాగతం పలికారు.

## ప్రజలకు అందుబాటులో సంజీవని సేవలు

**ప్రజాశక్తి-తాడేపల్లి**

తాడేపల్లి ప్రజలకు టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా లోకేశ్ ఏర్పాటు చేసిన సంజీవిని ఆసుపత్రి వైద్యశాల సేవలు అందుబాటులోకి వచ్చాయని టిడిపి పట్టణాధ్యక్షులు వి. వెంకట్రావు తెలిపారు. ప్రతిరోజూ ఔట్ పేషెంట్ల విభాగానికి 30 నుంచి 50 మంది వరకు వివిధ రకాల పరీక్షలు చేయించుకోవడానికి వస్తున్నారని అన్నారు. వివిధ రకాల స్కానింగ్‌ల కోసం ల్యాబ్‌లు ఏర్పాటు చేసి, మందులు కూడా ఉచితంగానే అందజేస్తున్నారని తెలిపారు. నిపుణులైన వైద్య బృందం అందుబాటులో ఉంటుందని, ప్రజలు సేవలు ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## నేడు నులిపురుగుల నివారణ దినోత్సవం

**ప్రజాశక్తి- దుగ్గిరాల**

నులిపురుగుల నివారణకు టాబ్లెట్స్ వాడటం వలన ఎటువంటి నష్టాలు గానీ రియాక్షన్ గాని ఉండదని అందువలన తప్పనిసరిగా పిల్లలందరూ ఈ టాబ్లెట్లు తీసుకోవాలని దుగ్గిరాల పిహెచ్‌సి డాక్టర్ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. ఈనెల 14వ తేదీ మంగళవారం నులిపురుగుల నివారణకు అన్ని విద్యాసంస్థలకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ పంపిణీ చేశామని తెలిపారు. ఒకటి నుండి 19ఏళ్ల వయసు కలిగిన వారందరికీ ఈ టాబ్లెట్లు అందజేస్తారన్నారు. ఈ టాబ్లెట్లు చప్పరించాల్సి ఉంటుందని, ఇవి రుచికరంగానే ఉంటాయని తెలిపారు. అందువలన పిల్లలు చెప్పరించడానికి ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు.వీటిని వాడటం వల్ల పిల్లలకు కడుపు నొప్పి ,నీరసం , వంటి వాటిని నివారించవచ్చని తెలిపారు. అలాగే పిల్లల్లో ఎదుగుదల కూడా కనిపిస్తుందని తెలిపారు.

## చైతన్య మృతి సామాజిక ఉద్యమాలకు లోటు

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

బహుజన సమాజ్ పార్టీ ఉద్యమ నాయకులు పొన్నాల చైతన్య సోమవారం గుంటూరులో గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి బహుజన్ ఉద్యమానికి తీరనిలోటని రాష్ట్ర రజక జనసేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు తెలిపారు. పొన్నాల చైతన్యకు శ్రద్ధాంజలి ఘటిస్తూ గుంటూరు జిల్లాలో కాన్షిరాంను తీసుకువచ్చిన సామాజిక ఉద్యమాలకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. ఉద్యమాలు చేస్తూనే ఉపాధ్యాయుడుగా ఎంపిక అయిన చైతన్య హార్ట్ ఎటాక్‌తో మరణించడం బహుజన వర్గాలకు తీరంలోటని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసినట్లు జూపూడి శ్రీనివాస్ రావు ఒక ప్రకటనలో తెలియజేశారు

# కారు ఢీ కొని ఒకరు మృతి - ఇద్దరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - రొంపిచర్ల

రోడ్డు ప్రక్కన ఆటోకు మరమ్మతులు చేస్తున్న వ్యక్తిని వాహనం ఢీ కొని ఒకరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని విప్పర్ల హైవేపై సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నరసరావుపేటకు చెందిన దావల చిన్నోడు (27) ఆటోలో ఇద్దరిని ఎక్కించుకుని హైవేపై నుండి వెళుతున్నాడు. ఈక్రమంలో విప్పర్ల దాటిన తర్వాత ఆటో టైర్ పంక్చర్ అయింది. రోడ్డు పక్కన ఆపి టైర్‌కు పంక్చర్ వేస్తుండగా, అదే రోడుపై వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి ఈ ఆటోను ఢీట్టింది. ఈ సంఘటనలో టైరుకు పంక్చర్ వేస్తున్న దావల చిన్నోడుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సిహెచ్ సురేష్‌బాబు పోలీస్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మిర్చి నిల్వలు

| | | బ్యాగులు |
|---|---|---|
| మిర్చి దిగుమతి | : | 1,33,124 |
| మిర్చి ఎగుమతి | : | 1,22,580 |
| మిర్చి నిల్వ | : | 88,554 |

## మిర్చి ధరలు

| | రూపాయలలో |
|---|---|
| 334 | 10,000 - 23,000 |
| నెం.5 | 10,000 - 23,500 |
| 273 | 16,500 - 23,000 |
| 341 | 15,000 - 23,500 |
| 4884 | 14,100 - 19,000 |
| సూపర్ 10 | 18,000 - 20,500 |
| నాన్ ఏసి | |
| తేజ | 9,000 - 23,000 |
| బడిగి | 10,000 - 26,500 |
| దేవనూరు డీలక్స్ | 10,000 - 25,000 |
| తాలుకాయలు | 5,000 - 13,500 |

# వాహనాల చోరీ కేసుల్లో నలుగురు అరెస్టు

ప్రజాశక్తి-కొల్లిపర: మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్ప డిన నిందితులను అదుపులోని తీసు కున్నట్లు తెనాలి డిఎస్పి కె.ప్రవంతిరాయ్ తెలిపారు. సోమవారం కొలిపర పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుంటూరు, బాపట్ల కృష్ణా జిల్లాలో బైక్ దొంగతనాలకు పాల్పడిన నలుగురు నిందితులను అదుపులోకి తీసు కున్నట్లు చెప్పారు. కొల్లిపర మండలం మున్నంగి కరకట్ట వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి నలుగురు యువకులు పారిపోతుండగా వారిని అదుపులోనికి తీసుకొని విచారించగా ఈ విషయం బయట పడిందన్నారు. వారి నుంచి 22 బైకులు స్వాధీనం చేసుకున్నామని వాటి విలువ సుమారు రూ15.20 లక్షలని తెలిపారు నిందితులు కొల్లిపర మండలం మున్నంగికి చెందిన బన్న రావూరి కోటేశ్వరరావు, మంగళగిరి మండలం నూతక్కికి చెందిన గరిక ఏసుబాబు, పెదవడ్లపూడికి చెందిన గరిక దుర్గారావు, గరిక ప్రసాదులను నిందితులుగా గుర్తించామన్నారు జల్సాలకు అలవాటు పడి బైకు దొంగతనాలకు పాల్పడు తున్నట్లు నిందితులు చెప్పారని అన్నారు. 22 బైకులలో 14 బైకుల యజమానులను గుర్తించాలన్నారు. బైకులు పోయిన బాధితులు సంబంధిత పత్రాలతో కొల్లిపర పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఆర్ రవీంద్రారెడ్డిని సంప్రదించాలని తెలిపారు. రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో దొంగతనం కేసును చేదించిన కొల్లిపర స్టేషన్ ఎస్ఐ ఆర్ రవీంద్రారెడ్డి పోతురాజు శ్యామ్ కుమార్ తాతారావు కూర్మారావును ఆమె అభినందించారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తెనాలి డీఎస్పీ స్రవంతి రాయ్

పట్టణ ఎస్ ఐ కు ఫిర్యాదు పత్రం అందిస్తున్న విలేకర్లు

## విలేకరికి కౌన్సిలర్ భర్త బెదిరింపు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్: 'నాపైనే వార్త రాస్తావా, నీ అంతూ చుస్తాను' అంటూ ఓ పత్రిక ఇన్‌ఛార్జిగా పని చేస్తున్న షేక్ సైదాను ఓ మహిళా కౌన్సి లర్ భర్త ఫోన్‌లో బెదిరించారని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎస్పీ రవి శంకర్‌రెడ్డి, పట్టణ ఎస్ఐ రఘుపతిలను కలిసి సోమవారం ఫిర్యాదు చేశారు. ఒక వార్త విషయంలో 12వ వార్డు కౌన్సిలర్ లోక్ కల్యాణి భర్త లోక్ మాధవ్, ఆతని సోదరుడు చంద్ర కలసి సైదాకు ఫోన్ చేసి అసభ్యంగా మాట్లా డంతో పాటు బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సైదా నివాసం ఉంటున్న ప్రాంతంలో అతనికోసం వెతికారని చెప్పా రు. వీరందరిపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే అం శమై పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్‌ను కలసి విన్న వించి నట్లు చెప్పారు. కార్యక్రమంలో విలేకర్లు, న్యాయవాదులు జి.అజయ్ కుమార్, చలపతి, ఎస్.సీతయ్య, శ్రీనాథ్, జి.రాజ బాబు, కోటేశ్వరరావు, ఎం.వెంకటేశ్వరరావు, నాగరాజు, రమే ష్, హనుమంతరావు, పూర్ణచంద్రరావు, పి.మహేష్, ఖలీల్ పాల్గొన్నారు

## నకరికల్లు ఆర్ఐగా అనూష

ప్రజాశక్తి-నకరికల్లు: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండల రెవెన్యూ ఇన్స్పక్టర్‌గా దావులూరి అనూష సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఆమె గతం లో బెల్లంకొండ మండలంలో జూనియర్ సహాయకులుగా పనిచేసినట్టు తెలిపారు. వృత్తి రీత్యా పదోన్నతి పొందినట్లు తెలిపారు. ఆమెకు తహశీల్దార్ సురేష్ . రెవెన్యూ సిబ్బంది అభినందనలు తెలిపారు.

---

**NOTICE**
**IN THE COURT OF THE PRL. DIST. JUDGE:: GUNTUR**
**G.W.O.P.NO:1015/2017**

Between:
Narukullapati Madhavi Latha……Petitioner
And
Pamulapati Pavan Kumar …..Respondent
To.
Pamulapati Pavan Kumar, S/o.Samba Siva Rao, R/o. Block-6,Flat No:TF-3, Rajeev Gruhakalpa, Adivitakkella padu,Guntur (Rural Md.&Dist.)

పై నెంబరు పిటీషనులో రెస్పాండెంట్ అయిన మీకు పై కోర్టు వారి ద్వారా మరియు రిజిష్టరు పోస్టుల ద్వారా నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు నోటీసు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది: 20-03-2023 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ. గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ లేక మీ వకీలు గారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 20-03-2023

**యస్.ఏడుకొండలు,**
**బి.బాజీ,**
**పిటీషనరు తరపు అడ్వకేట్స్,**
**నగరం పాలెం 5వలైను, గుంటూరు.**

---

**మహారాజశ్రీ నరసరావుపేట అడిషనల్ సీనియర్ సివిల్‌జడ్జి గారి కోర్టులో**
**ఓ.ఎస్. 4/2017 ఇ.పి. 36/2018 ఇ.ఎ. 29/2022**

బిట్వీన్
1. మెడబలిమి గోవా శౌరయ్య (డైడ్)
2. మెడబలిమి అంతయ్య
3. మెడబలిమి @ రెడ్డిమాసు ఆంతోని మేరి
4. నరిశెట్టి ప్రకాశమ్మ
5. తోట అన్నమేరి … పిటీషనరు / డిహెచ్ఆర్

వర్సెస్
మెడబలిమి విలియం బాబు ..రెస్పాండెంట్/జెడిఆర్

పై నెంబరు ఇ.పి.లో డిహెచ్ఆర్ చనిపోయినందున, వారి వారసులైన పిటీషనర్లు 2 నుండి 5 వారలు, వీరిని డిహెచ్ఆర్‌కు వారసులుగా చేర్చగలందులకు పిటిషన్ దాఖలు చేయగా ఇందలి జెడిఆర్ యొక్క నోటీసు నిమిత్తం ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున ఇందలి జెడిఆర్ ది. 28-3-2023న ప్రత్యక్షంగా గాని, లేక మీ యొక్క ప్లీడరుగారి ద్వారా హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీకోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది: 28-3-2023

**చెన్నుపాటి నాగేశ్వరరావు,**
**అడ్వకేటు, నరసరావుపేట.**
**ఫోన్ : 94410 65687**

---

**NOTICE**
**IN THE COURT OF THE HON'BLE II ADDL. DIST. JUDGE:: GUNTUR**
**M.V.O.P.No: 193/ 2020**

Between:
VAAKA SAMBAIAH ... Petitioner
And
A.P.S.R.T.C. Vijayawada, Rep.by its VC&MD and Another ...Respondents
**To,**
**R-2:** P.Veera Raghavaiah, S/o.Vuyaraiah, R/o.Door No:2-3-12,Chenchupet Tenali Town, Guntur Dist., ( Driver of the A.P.S.R.T.C. BUS Bearing No: AP 29 Z-2179 )

పై నెంబరు O.P లోని పిటీషనర్ యాక్సిడెంట్‌లో తనకు తగిలిన గాయాలకు నష్టపరిహారము కోరుచూ పిటీషన్ దాఖలు చేయగా సదరు O.P.లో 2వ రెస్పాండెంట్ అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది: 31-03-2023 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ.గం. 10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:31-03-2023

**చుక్కపల్లి రమేష్,**
**పిటీషనర్ తరపు అడ్వకేట్, గుంటూరు.**

---

# గ్రామ పంచాయతీ కార్యాలయము-అమృతలూరు

**అమృతలూరు మండలం, బాపట్ల జిల్లా.**

## టెండరు నోటీసు

**ఆర్.ఓ.సి. 05/2023** **తేది:- 10-03-2023**

బాపట్ల జిల్లా, అమృతలూరు మండలము, అమృతలూరు గ్రామ పంచాయతీ లోని ఈ దిగువ తెల్పిన షెడ్యూలు దాఖలా సామాన్లు సరఫరా చేయుట కొరకు సీల్డు చేసిన టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లు గ్రామ పంచాయతీ కార్యాలయము నందు ది. 17-03-2023 మధ్యాహ్నం 3 గంటలకు సీల్డు చేసిన టెండర్లు స్వీకరించబడును. సదరు టెండర్లు అదే రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు అప్పటికి హాజరు కాబడిన టెండరుదారుల సమక్షంలో పంచాయతీ కార్యదర్శి వారిచే టెండర్లు తెరవబడును. టెండర్లు దాఖలు చేయువారు షెడ్యూలు దాఖల ధరావత్తులు చెల్లించి రశీదులను టెండర్లుకు జత చేయవలయును. ధరావత్తులు చెల్లించని టెండర్లు ఆమోదించబడవు. టెండర్లు తిరస్కరించుటకు లేక ఆమోదించుటకు కార్యదర్శి గారి పూర్తి అధికారము కలదు. ఇతర వివరములకు కార్యాలయము పని చేయు సమయములో సంప్రదించవచ్చును.

| వ.నెం. | వివరములు | ధరావత్తు |
|---|---|---|
| 1 | 2023-2024 సం., నకు ప్రజారోగ్య సామాన్లు సరఫరా చేయుటకు | 100-00 |
| 2 | 2023-2024 సం., నకు చేతి పంపు సామాన్లు సరఫరా చేయుటకు | 100-00 |
| 3 | 2023-2024 సం., నకు PWS సామాన్లు సరఫరా చేయుటకు | 100-00 |
| 4 | 2023-2024 సం., నకు స్టేషనరీ సామాన్లు సరఫరా చేయుటకు | 100-00 |
| 5 | 2023-2024 సం., నకు టెండరు పద్దతిపై స్వీపరుగా పని చేయుటకు 6 పోస్టులు (01-04-2023 నుండి 31-03-2024 వరకు) | 100-00 |
| 6 | 2023-2024 సం., నకు టెండరు పద్దతిపై ఎలక్ట్రీషియన్ గా పని చేయుటకు 1 పోస్ట్(01-04-2023 నుండి 31-03-2024 వరకు) | 100-00 |
| 7 | 2023-2024 సం., నకు టెండరు పద్దతిపై ట్రాక్టరు డ్రైవర్ గా పని చేయుటకు 1 పోస్ట్ (01-04-2023 నుండి 31-03-2024 వరకు) | 100-00 |
| 8 | 2023-2024 సం., నకు టెండరు పద్దతిపై నైట్ వాచర్ గా పని చేయుటకు 1 పోస్ట్ (01-04-2023 నుండి 31-03-2024 వరకు) | 100-00 |
| 9 | 2023-2024 సం., నకు టెండరు పద్దతిపై PWS పంపు ఆపరేటర్ గా పని చేయుటకు 1 పోస్ట్ (01-04-2023 నుండి 31-03-2024 వరకు) | 100-00 |
| 10 | SWPC షెడ్ కు అవసరమైన సామాన్లు సరఫరా చేయుటకు | 100-00 |

**గమనిక:-** గ్రామ పంచాయతీ నిధులు సమృద్ధిగా ఉన్నప్పుడు CFMS ద్వారా మాత్రమే బిల్లులు చెల్లించబడును.

**సం//- బొల్లు అనిల్ కుమార్**
**పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ, అమృతలూరు.**

---

**NOTICE**
**IN THE COURT OF THE HON'BLE IV ADDL. SENIOR CIVIL JUDGE:: GUNTUR**
**I.A.NO.:494/2022 IN O.S.NO.674/2016**

Between:
Pallapu Pulla Rao ... Petitioner/Plaintiff
And
Palavelli Venkata Ramana ( P.V.Ramana ) ... Respondent/Defendant

To,
Palavelli Venkata Ramana (P.V.Ramana), S/o.Subba Ramaiah, Retd.Employee, R/o.Door No:25-16-126/4, 2/1 Yesu Bhakta Nagar,Mahatma Gandhi Nagar, Guntur.

పై నెంబరు దావా లోని ఐ.ఎ.ను పిటీషనరు/ వాది, రెస్పాండెంటు పై దావా నెం:674/2016 లో డిక్రీ పొంది,సదరు డిక్రీ అమలు ఇ.పి.నెం:258/2018 దాఖలు చేసి Salary Attachments పొందగా ,సదరు రెస్పాండెంటు అప్పీలు దాఖలు చేయగా,సదరు అప్పీలు సమయంలో శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము డిపాజిట్ చేసిన Rs 200000/- లను రెస్పాండెంటు కోర్టు వారి వద్ద డిపాజిట్ చేసియున్నారు. ప్రస్తుతం ఎటువంటి అప్పీలు నిల్వలో లేనందున తన బాకీ నిమిత్తము C.C.D.Account లోని మొత్తమును పొందుటకు పై నెంబరు ఐ.ఎ.494/2022 పిటీషన్ దాఖలు చేయగా సదరు పిటీషనులో రెస్పాండెంట్/ ప్రతివాది అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది: 31-03-2023 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ.గం. 10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

( శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:31-03-2023

**బూదాటి సాగర్,**
**పిటీషనర్/ వాది తరపు అడ్వకేట్,**
**గుంటూరు.**

---

**మహారాజశ్రీ నరసరావుపేట అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో**
**IA 369/2022 in IA 351/2021**
**in**
**OS 70/2016**

Between:-పాములపాటి శ్రీనివాస్ …వాది/పిటీషినర్
అండ్
జొన్నకూటి రత్న కుమారి(డైడ్)
…రెస్పాండెంట్స్/ప్రతివాది అండ్ 3 అదర్స్
To,
**R2:-**పిల్లి జీవన్ కుమార్, S/o Not Known
**R3:-**పిల్లి వినీత్, S/o జీవన్ కుమార్
**R4:-**పిల్లి శ్రవణ్, S/o జీవన్ కుమార్
R2 to R4. R/o.House No:5-59-4/A, వార్డ్ నెం.5, 5th లైన్, కోబాల్ట్‌పేట్, గుంటూరు పట్టణం, గుంటూరు జిల్లా.

పై నంబర్ దావా లో ప్రతివాది పైన విక్రయ అగ్రిమెంట్ సేల్ తాలుకు దావా దాఖలు చేయగా ది.13-10-2017నే వాది కోర్టుకు హాజరు కాలేనందున సదరు దావాను కోర్టు వారు Dismiss Far Default చేసినారు. సదరు Dismissal Order Dt.13-10-2017 ను Set aside చేయ నిమిత్తం U/o 9 Rule 9 మరియు U/s 5 Limitation Act క్రింది 1140 రోజులు Debyను Condone చేయమని IA 351/2021 దాఖలు చేయగా సదరు పిటీషన్ లో కోర్టు ద్వారా రెస్పాండెంట్/ప్రతివాది కి నోటీసు పంపించిననూ సదరు రెస్పాండెంట్/ప్రతివాది ది.12-12-2022 వ తేది చనిపోయినారు అని కోర్టుకు Return కాబడినందున సదరు ప్రతివాది వారసులను దావాలో చేర్చుటకు IA 369/2022 దాఖలు చేయగా R2 to R4 కు నోటీసు పంపించిననూ ముట్టనందున శ్రీ కోర్టు వారి ఆర్డర్ ప్రకారం సబ్సిట్యూట్ సర్వీస్ ద్వారా పేపరు పబ్లికేషన్ నిమిత్తం 31-03-2023 వ తేదికి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు ఉ॥గ॥ 10-30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుసుకొనవలెను. లేని యెడల ఎక్స్‌పార్టీ చేసి మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో
వాయిదా తేది:31-03-2023

**ఇట్లు**
**పంగులూరి ఆంజనేయులు చౌదరి,**
**అడ్వకేట్, నరసరావుపేట,**
**సెల్.నెం:9849314557.**

ఫిర్యాదులు స్వీకరిస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్, జెసి తదితరులు

## ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

ప్రజాశక్తి-నరసరావుపేట

స్పందన ఫిర్యాదులపై జిల్లా అధికారులు ప్రత్యేక దష్టి సారించి పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు.పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల ( స్పందన) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు.

**ప్రభుత్వానికి చెల్లించాల్సిన అద్దెలు చెల్లించట్లేదు**

నరసరావుపేటకు చెందిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి బొగ్గారపు మూర్తి జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటిని కలిసి ప్రభుత్వానికి చెల్లించాల్సిన అద్దెలను చెల్లించకుండా అక్ర మంగా షాపులు నిర్వహిస్తున్న వారిపై ఫిర్యాదు చేశారు. స్థానిక నరసరావుపేట గాంధీ పార్క్ ఎదు రుగా ఉన్న 197 9లో ఏర్పాటు చేసిన తాలూకా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఆధ్వ ర్యంలో నాలుగు కమ ర్షియల్ షాపులు, ఒక మీటింగ్ హాలు ఉన్నట్లు చెప్పారు. వాటిని కాకా నికి చెందిన మాజీ గ్రామ పరిపాలనాధికారి ఎం.వెంకయ్య చౌదరి, రవీంద్ర రంగయ్యలు కోర్టు స్టేల ఆధారంగా గత కొంతకాలంగా ప్రభుత్వానికి చెల్లించాల్సిన అద్దెలను చెల్లించ కుండా అక్రమంగా షాపులు నిర్వహిస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై తక్షణమే స్పందించిన కలెక్టర్, ప్రభుత్వానికి సంబంధించిన రాబడిని చెల్లించేలా, ప్రభుత్వ ఆస్తులను అన్యా క్రాం తం కాకుండా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**పంచాయతి అధికారి లంచం అడుగుతున్నారు**

కారంపూడి పంచాయతి నిధులతో తోటబజారు బ్రహ్మ నాయుడు కళ్యాణ మండపం సమీపంలో ఆక్రమణలు తొలగించాలని, రోడ్డు నిర్మాణం చేపట్టాలని మండల పరిషత్, రెవెన్యూ అధికారులను హ్యూమన్ రైట్స్ ఆదేశించినప్పటికీ ఫలితం లేదని మండల కేంద్రం కారం పూడికి చెందిన బొమ్మిన ప్రభా కరరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రూ.20 వేలు లంచం ఇవ్వాలని గ్రామ పంచాయితి అధికారి డిమాండ్ చేస్తున్నారని, రోడ్డు నిర్మాణం చేపట్టడం లేదని సమస్య పరిష్కరించాలని కోరారు.

**మెగా డీఎస్సీ కోసం వినతి**

ప్రభుత్వం మెగా డీఎస్సీ విడుదల చేసి ఉపాధ్యాయ భర్తీ చేయాలని కోరుతూ అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అంద జేశారు. ఎఐవైఎఫ్ పల్నాడు జిల్లా కన్వీనర్ షేక్ సుభాని మాట్లాడుతూ మెగా డీఎస్సీ విడుదల చేసి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ భర్తీ చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి 4 ఏళు గడుస్తున్నా హామీ నెరవేర్చలేని సీఎం జగన్‌పై విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మెగా డీఎస్సీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎఐవైఎఫ్ నరసరావుపేట ఏరియా కార్యదర్శి గుండాల శ్రీ హర్ష పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో నేడు నవోదయం

ప్రజాశక్తి-నరసరావుపేట

జిల్లాలో ఎస్సీ,ఎస్టీల అభ్యున్నతికి చేపడుతున్న నవోదయం కార్యక్రమం మంగళవారం ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయంలోని స్పందన సమావేశ మందిరంలో జరగ నుంది. ఈ కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు కలెక్టర్ కార్యాలయం నుండి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈకార్యక్రమానికి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఉద్యోగ, విద్య, ఉపాధి, వ్యాపార నిమిత్తం హాజరై దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు.

# క్షేత్రస్థాయిలో విచారణ చేసి సకాలంలో పరిష్కరించాలి

ప్రజాశక్తి - నరసరావుపేట

స్పందన ఫిర్యాదులు క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి సకాలంలో పరిష్కరించాలని పోలీస్ అధికారులను పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆదేశించారు. పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. వివిధ సమస్యలకు సంబంధించి అందిన ఫిర్యాదుల్లో కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు మొదలైన సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా అందాయని తెలిపారు.

అర్జీదారులకు సహాయ సహకారాలు అందిస్తున్న పోలీస్ సిబ్బంది

**తమ్ముడి భార్య నా ఆస్తిపై కన్నేసింది**

తమ్ముడి భార్య తన ఆస్తిపై కన్నేసిందని, తన తల్లిపై దాడి చేసి గాయ పరిచిందని మండల కేంద్రం దుర్గికి చెందిన వెండి వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. తండ్రి నుండి వారసత్వంగా వచ్చిన 3 ఎకరాల పొలాన్ని తమ్ముడు శ్రీని వాసరావు, తాను సమానంగా పంచుకొని అనుభవి స్తున్నామన్నారు. తన అస్తిపై కన్నే సిన తమ్ముడి భార్య లక్ష్మీ భయభ్రాంతు లకు గురిచేస్తోందని, తన చిన్న కుమా రుడుపై ఆమె అక్రమంగా కేసు పెట్టి పోలీసులతో కొట్టించిందని తెలిపారు. ఈ విషయమై పోలీసులను ప్రశ్నించగా తన పెద్దకుమారుడుని కూడా వారు కొట్టారని, దుర్గి పోలీసులు ఆమెకు అనుకూలంగా వ్యవ హరిస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

**ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వట్లేదు**

చోరీకి గురైన తన యమహా ఎఫ్ జడ్ ద్విచక్ర వాహనానికి ఇన్సూరెన్స్ క్లయిమ్ చేసుకునేందుకు ఎఫ్ఐఆర్ కాపీ కోసం వినుకొండ పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని స్థానిక కొత్తపేటకు చెందిన రావూరి అంజిబాబు ఫిర్యాదు చేశారు. ఇంటి ముందు పార్కింగ్ చేసిన రూ.1.60 లక్షల యమహా ఎఫ్‌జడ్ ద్విచక్ర వాహనం చోరీకి గురైందని చెప్పారు. ఎఫ్ఐఆర్ కోసం 3 నెలలుగా వినుకొండ పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదనిఫిర్యాదు చేశారు.

**భర్త చంపేస్తానని బెదిరిస్తున్నాడు**

కళాశాల రోజుల్లో తోటి స్నేహితురాలి సోదరుడు రవివర్మతో ప్రేమించి,పెద్దలను ఎదిరించి వివాహం చేసుకున్నానని, ఒక అబ్బాయి పుట్టిన తర్వాత. తన భర్త ఇప్పుడు కట్నం కోసం వేధింపులకు పాల్పడుతున్నాడని బొల్లాపల్లి మండలం మేళ్లవాగు గ్రామానికి చెందిన వివాహిత ఫిర్యాదు చేసింది. తన భర్త మండల కేంద్రం మాచరానికి చెందిన చిరువ్యాపారి అని, వేధింపులు తాళలేక బిడ్డతో సహా పుట్టింటికి వెళ్లిపోయానని తెలిపింది. ప్రైవేట్ స్కూల్‌లో ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్నానని, స్కూల్ దగ్గరకు భర్త వచ్చి దాడి చేస్తున్నాడని, కట్నం ఇవ్వకపోతే విడాకులు ఇవ్వాలని లేకుంటే చంపేస్తానని బెదిరింపులకుపాల్పడు తున్నాడని ఫిర్యాదు చేసింది. భర్త నుండి తనకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరింది.

**అధికార పార్టీ నాయకులు దాడి చేసినా చర్యలుండవా?**

అధికార పార్టీ నాయకులు దాడులు చేసినా పోలీ సులు చర్యలు తీసుకోరా అని నకరికల్లు మండలం కుంకలగుంట కు చెందిన డి.నాగలక్ష్మి ప్రశ్నించారు. తన భర్త 13 ఏళ్ళ క్రితం అనారోగ్యంతో మృతి చెందాడని ఈ క్రమంలో గ్రామంలో అధికార పార్టీకి చెందిన తమ సమీప బంధువు దమ్మువళం జాలయ్య తనను లైంగికంగా వేధిస్తున్నా రని ఆరోపించారు. తాను లొంగకపోవ డంతో తమ ఇంట్లోని చెత్త బయటకు పడేసే విషయంలో తనపై తన కుమారుడుపై జాలయ్య, అతని భార్య అంకమ్మ అక్రమంగా దాడి చేసి కొట్టారని నకరికల్లు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని తెలిపారు. తమపై వేధింపులు మరింత ఎక్కువయ్యాయని ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

**బలవంతంగా నోటు రాయించారు**

ఇద్దరు మహిళల మధ్య ఉన్న ఆర్థిక లావాదేవీల వ్యవహారంలో పెద్ద మనిషిగా ఉన్న తనతో పోలీసులు అక్రమంగా నోట్లు రాయించారని పిడుగు రాళ్లకు చెందిన పి.వివిష్ణుమూర్తి ఫిర్యాదు చేశారు. పట్ట ణానికి చెందిన నూర్జ హాన్ , నాగూర్ బికి ఇవ్వాల్సిన డబ్బులు గురించి మధ్యవర్తిత్వం చేశానని తెలిపారు. నాగూర్ బి కి డబ్బులు ఇవ్వాలని బలవంతంగా తనతో నోట్లు రాయించారని, రెండు రోజుల్లో రూ.4.70 లక్షలు చెల్లించకపోతే అరెస్ట్ చేస్తామని బెదిరిస్తున్నారని, తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు.

**ఉద్యోగం పేరుతో మోసం**

ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీలో పని చేసే కృష్ణ ప్రసాద్ తనను మోసం చేశాడని క్రోసూ రు మండలం దొడ్లేరుకు చెందిన గాలి శ్రీనివాస్‌గౌడ్ ఫిర్యాదు చేశ్వారు. నకిలీ ఉత్తర్వులు, నకిలీ ఉద్యోగ నియామక పత్రాలు చూపించి, 2020 నుండి విడతల వారీగా తన వద్ద నుండి రూ.12 లక్షలు తీసుకొని మొహం చాటేశాడని తెలిపారు. అతన్ని ఈ విషయమై నిలదీస్తే 'చేతనైంది చేసుకో' అని బెదిరిస్తున్నాడని , 2021లో క్రోసూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేయడం లేదని, తనకు న్యాయం చేయాలని కోరారు.

**స్థలం కాజేయాలని చూస్తున్నారు**

తనకు,తన అక్కకు వారసత్వంగా తన తండ్రి ఇచ్చిన స్థలాన్ని కాజేయా లని చూస్తున్నారని వృద్ధురాలు ఎంపరాల గంగమ్మ ఫిర్యాదు చేశారు. చిలకలూరిపేట మండలం కట్టుబడివారిపాలెంలో తమకు చెం దిన 300 గజాల స్థలాన్ని తన పినతల్లి కుమారుడి భార్య గోరంట్ల సామ్రాజ్యం, ఆమె కుమారులు గంగాధర్, సాంబశివ రావు కాజేయాలని చూస్తున్నారని ఆరోపించారు. తమకు తెలియకుండా అదే గ్రామానికి చెందిన గుంటుపల్లి పుల్లయ్యకు ఈ స్థలాన్ని విక్రయించారని, దీనికి సంబంధించి గ్రామ పంచాయతి కార్యదర్శి నకిలీ ఇంటి పన్ను కాగితాలు ఇచ్చి వారికి సహకరించాడని ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని ఎస్పీని కోరారు.

## 'రేషన్ ఇవ్వట్లేదు'

ప్రజాశక్తి - వినుకొండ

తహశీల్దార్ కు ఫిర్యాదు చేసిన కార్డుదారులు

మార్చి నెల రేషన్ సరుకులు ఇవ్వలేదని పట్టణంలోని 26వ వార్డు కట్ట కింద బజార్ మహిళలు సోమవారం స్పందనలో వినుకొండ తహశీల్దార్ కిరణ్ కుమార్ కు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని 26వ వార్డు 9వ నెంబర్ రేషన్ షాప్ పరిధిలో ఎమ్‌డిఎమ్ వాహనం ద్వారా తమకు రేషన్ అందాల్సి ఉందన్నారు. రేషన్ సరఫరా ప్రారంభమై 13 రోజులు గడిచినా ఇంత వరకూ తమకు రేషన్ సరుకులు పంపిణీ చేయలేదని తెలిపారు. తమ వార్డులోని అన్ని బజార్లకు రేషన్ సరుకులు పంపిణీ చేశారని, కట్ట కింద రెండు బజార్లలో సుమారు 300 ఇళ్ళకు రేషన్ ఇవ్వలేదని పేర్కొన్నారు. మార్చి నెల రేషన్ ఇవ్వలేదని షాపు డీలర్, ఎమ్‌డిఎం వాహన నిర్వాహకులను ప్రశ్నిస్తే, 'రేషన్ లేదు.. మీకు రేషన్ వచ్చే నెల వస్తుంది' అని చెప్పారన్నారు. 9వ నెంబర్ రేషన్ షాపును ఇద్దరు మహిళలు నిర్వహిస్తుండగా, అందులో ఒక మహిళ రేషన్ అక్రమంగా తరలించి అమ్ముకున్నట్లు ఫిర్యాదు చేశారు. ప్రతి నెలా రేషన్ సక్రమంగా ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. సమగ్ర విచారణ చేపట్టి రేషన్ సరుకులు పంపిణీ చేయాల్సిందిగా కార్డు లబ్ధిదారులు షేక్ రసూల, విశ్వజ, ఆర్. లక్ష్మి, రిహానా, నాసరమ్మలతో పాటు సుమారు 50 మంది మహిళలు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ ఆ షాపులో తక్షణమే స్టాక్ రికార్డులు తనిఖీ చేసి చర్యలు తీసుకోవాల్సిందిగా సిఎస్డిటి, వీఆర్వోలను ఆదేశించారు. వెంటనే రేషన్ సరఫరా చేయాలని ఆదేశించారు.

## మాచర్ల ఆర్ఐగా నిమ్మల శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మాచర్ల మండల ఆర్ఐగా నిమ్మల శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు ఆయన దుర్గిలో జూనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తూ పదోన్నతిపై మాచర్ల వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు మాచర్ల తహశీల్దార్ రమేష్ కుమార్ నియామక పత్రాలు అందజేశారు బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావుకు డిప్యూటీ తహశీల్దార్ వాణి, సీనియర్ అసిస్టెంట్ ఫణీంద్ర కుమార్, వీఆర్ఏల యూనియన్ సెక్రెటరీ మారుపాకల శ్రీనివాసరావు, కంప్యూటర్ ఆపరేటర్ నాగవల్లి తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు

## నులిపురుగుల నివారణపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-నాదెండ్ల

జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని సచివాలయల పరిధిలో సోమవారం ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. నాదెండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, డా.సాయిశ్వేత అధ్వర్యంలో నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు ప్రియాంక , సాయి శ్వేతలు మాట్లాడుతూ మంగళవారం నులిపురుగుల నివారణకు నిమిత్తం మాత్రల పంపిణీ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం, ప్రైవేట్ విద్యా సంస్థల్లో కలిప మొత్తం 7380 మంది పిల్లలకు నులిపురుగుల నివారణ మందులు ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి తలతోటి రాణి, సిహెచ్ఒ రత్నరాజ్యం,ఎంపిహెచ్ఇఒ విజయరాజు భూపతిరావు, ఎంపిహెచ్ఎస్, ఆశా వర్కర్లు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# స్పందనకు 177 అర్జీలు

ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, జెసి తదితరులు

**ప్రజాశక్తి-గుంటూరు**
స్పందన పిటీషన్లు సరిగా పరిష్కరించకుండా, రీఓపెన్ అయితే అట్టి వాటిపై తదుపరి ఉన్నతాధికారి స్వయంగా పరిశీలించి పిటిషన్‌ను హేతుబద్ధంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జెసి రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణశర్మ, డిఆర్‌ఒ కె.చంద్రశేఖర్‌రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యం.వెంకటశివరామిరెడ్డి జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 123 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోర్టు కేసుల పట్ల సకాలంలో స్పందించి కౌంటర్లు దాఖలు చేయాలని, అలాగే 31 పెండింగ్ కోర్టు ధిక్కార పిటిషన్లపై కౌంటర్ దాఖలు చేయాలన్నారు. వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వేలు చేసి వివరాలు యాప్ ద్వారా అందించాలన్నారు. మార్చి 14న తేదీన 'డీ వార్మింగ్' కార్యక్రమాన్ని పకడ్బందిగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ, డ్వామా, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్లు హరిహరనాథ్, యుగంధర్ కుమార్, సాయినాథ కుమార్, ఎస్సీ వెల్ఫేర్ డిడి మధుసూధనరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు, ఆర్‌అండ్ బి పర్యవేక్షక ఇంజనీర్ నిర్మల, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, డిఇఒ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేయాలి

స్థానిక గుంటూరు చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ ఉర్దూ బాలికల హైస్కూల్‌ను జూనియర్ కాలేజిగా అప్‌గ్రేడ్ చేయాలని ముస్లిం పెద్దలు స్పందనలో అర్జీ అందచేశారు. మైనార్టీ విద్యార్థినులు ఎక్కువ మంది చదువుకునే ఈ హైస్కూల్‌లో పదో తరగతి వరకే ఉందని, ఆతర్వాత ఇంటర్‌కు వెళ్లటానికి ప్రభుత్వ విద్యకు కాలేజి లేకపోవటంతో చాలా మంది బాలికలు విద్యకు దూరం అవుతున్నారని, కావున అదే పాఠశాలను అప్‌గ్రేడ్ చేస్తే బాలికా విద్యకు ప్రోత్సాహం ఉంటుందన్నారు. దూర ప్రాంతానికి బాలికలను పంపించటానికి తల్లిదండ్రులు సుముఖంగా ఉండట్లేదన్నారు. సుమారు 500 మంది విద్యార్థినులు, 60 మంది వరకూ పదో తరగతి విద్యార్థినులు ఉన్నారన్నారు. ఇంటర్ విద్య ప్రారంభించే వారందరికీ ఉపయోగమన్నారు. కావున వచ్చే విద్యా సంవత్సరం నుండి ఇంటర్ కాలేజి ప్రారంభించాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో వక్ఫ్ కార్పొరేటర్ ఖాజా మొహిద్దీన్ ఛిస్టీ, వక్ఫ్‌బోర్డు జిల్లా ప్రెసిడెంట్ జిలాని, సెక్రెటరీ సమీవుల్లాబేగ్, డైరెక్టర్లు సయ్యద్ సుభాని, మున్నా, కరీముల్లా, వైసిపి మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ సయ్యద్ హబీబుల్లా తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు అందజేసి మాట్లాడుతున్న బాధితులు

## ఆక్రమణల తొలగింపులో అన్యాయం

ఆక్రమణల తొలగింపు పేరుతో తొలగించిన పట్టాభూముల్లోని ఇంటి యజమానులకు న్యాయం చేయాలని కోరుతూ బాదితులు అర్జీ అందజేశారు. రోడ్డు ఆక్రమణల తొలగింపు పేరుతో పట్టా భూముల్లో ఉన్న తమ రెండు ఇళ్లకు తొలుత సగమే మార్కింగ్ ఇచ్చారని, తర్వాత మొత్తం తొలగించారన్నారు. తమ గృహాల ముందు ఉన్న కాల్వను వెనక్కి జరిపి నిర్మించారన్నారు. అప్పటి నుండి తిరిగి మా స్థలం మాకు ఇవ్వండని అడిగినా ఇవ్వకుండా అధికారులు ఇబ్బంది పెడుతున్నారని అర్జీ అందజేశారు. సుమారు 10 నెలల నుండి ఆరు కుటుంబాలు ఇళ్లు లేక అద్దెకు ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు అధికారుల్ని కలిసినా తమ గురించి పట్టించుకోవట్లేదని కన్నీటి పర్యంతం అయ్యారు. స్థానిక తహశీల్దార్ స్పందించి, పంచాయతీ వారికి, ఆర్‌అండ్‌బి వారికి నోటీసులు ఇవ్వాలని సర్వేర్‌ను ఆదేశించారని, కానీ పంచాయతీ అధికారులు తీసుకోవట్లేదన్నారు. కావున తమకు న్యాయం చేయాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో కృష్ణవేణి, మల్లేశ్వరి, లక్ష్మీప్రసన్న, కళ్యాణి, పద్మ తదితరులున్నారు.

## గడువులోగా ఫిర్యాదులు పరిష్కరించాలి : ఏసీ

**ప్రజాశక్తి-గుంటూరు**
ప్రజల నుండి సమస్యలపై అందే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సచివాలయ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని నగర అదనపు కమిషనర్ పెద్ది రోజా తెలిపారు. సోమవారం కమిషనర్ ఆదేశాలతో అదనపు కమిషనర్ నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ స్పందనలో 54 ఫిర్యాదులు అందాయి. వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 11, ఇంజినీరింగ్ విభాగం 22, ప్రజారోగ్య విభాగం 3, రెవెన్యూ విభాగం 11, ఉపా సెల్ విభాగం కి సంబధించి 5, అకౌంట్స్ విభాగం సంబంధించి 1, పరిపాలన విభాగానికి సంబంధించి 1ఫిర్యాదులు ఉన్నాయి. ఆయా ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్.ఈ. భాస్కర్, సిటీ ప్లానర్ మూర్తి, డిప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, సిఎంఓహెచ్ డాక్టర్ విజయలక్ష్మి, ఎం.హెచ్.ఓ. డాక్టర్ భాను ప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ, ఉపాసెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కమిషనర్ పెద్ది రోజా

తాడేపల్లిలో కరపత్రాలతో ప్రచారం చేస్తున్న నాయకులు

వడ్డేశ్వరంలో కరపత్రాలు పంచుతున్న నాయకులు

మంగళగిరిలో మాట్లాడుతున్న నాయకులు

# 5న చలోఢిల్లీని జయప్రదం చేయండి

**ప్రజాశక్తి-తాడేపల్లి**
మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమానికి తరలిరావాలని సిఐటియు పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు కోరారు. సోమవారం తాడేపల్లి ఎంపిడిఒ కార్యాలయం తదితర ప్రాంతాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్మికులు, ఉద్యోగులు, రైతులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ ఒకపక్క ప్రజల ఆదాయాలు తగ్గుతుంటే, మరోపక్క ఆదాని ఆదాయం మాత్రం రూ.31 కోట్లు పెరుగుతోందని విమర్శించారు. మధ్యాహ్నభోజన కార్మికుల గ్రూప్ సమావేశంలో కూడా పాల్గొన్నారు. చలో ఢిల్లీకి తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి వి.దుర్గారావు, నాయకులు ఎ.శవిరి బర్తులం, టి.జోజెపిన్ పాల్గొన్నారు.

**ప్రజాశక్తి, తాడేపల్లి రూరల్**
కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న ఢిల్లీలోజరుగు కార్మిక, కర్షక ర్యాలీని జయప్రదం చేయాలని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు అన్నారు. సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం మసీదు సెంటర్ వద్ద కరపత్రాలు పంచుతూ ప్రజాసంఘాల నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం నరేంద్ర మోడీ నాయకత్వన అధికారంలోకి వచ్చిన తర్వాత. ప్రజలపై అధిక భారాలు వేసిందని అన్నారు. పెట్రోల్ ,డీజిల్ ,గ్యాస్ ధరలు మునుపన్నడూ లేని విధంగా విపరీతంగా పెంచడం వలన నిత్యావసర వస్తువులు ధరలు ఇబ్బడి, ముబ్బడిగా పెరిగాయి అన్నారు.

కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏప్రిల్ 5న ఢిల్లీలో జరుగు కార్మిక కర్షక ర్యాలీని జయప్రదం చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు, కార్మికులు, కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, బి గోపిరెడ్డి, సిఐటియు తాడేపల్లి మండల నాయకులు వడ్డేశ్వరం బాబురావు, వడ్డేశ్వరం పున్నయ్య, మాజి సర్పంచ్ వి.బీక్షాలు, వి మరియ దాస్, జి.ప్రభు దాస్, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - మంగళగిరి**
కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రమాలలో కార్మికుల పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు యస్ యస్ చెంగయ్ అన్నారు. సోమవారం మంగళగిరి సిఐటియు కార్యాలయంలో జరిగిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఘాట్ రోడ్ ఆటో స్టాండ్ యూనియన్ విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆటో యూనియన్ నాయకులు విజయ్ అధ్యక్షత వహించారు. చేంగయ్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజలపై భారాలు వేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కేంద్రం అనుసరిస్తున్న విధానాలను సమర్థిస్తూ ప్రజలపై భారాలు వేస్తుందని విమర్శించారు. ఈ సమావేశంలో సిఐటియు పట్టణ కార్యదర్శి వై కమలాకర్, ఆటో యూనియన్ నాయకులు ఎస్ గణేష్, సాంబయ్య, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

## రేపు భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ మహాసభ

**ప్రజాశక్తి -మంగళగిరి**
పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘం 16వ మహాసభను ఈనెల 15వ తేదీన మంగళగిరి టిప్పర్ల బజార్లో గల అంజుమన్ షాదీ ఖానాలో ఉదయం 9 గంటలకు జరుగుతుందని పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు టి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం మంగళగిరి భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మహాసభను భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు యు ఉమామహేశ్వరరావు ప్రారంభిస్తారని తెలిపారు. ఉపన్యాసకులుగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వి నరసింహారావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి లక్ష్మీనారాయణ, సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చెంగయ్య, సిఐటియు పట్టణ కార్యదర్శి వై కమలాకర్, పట్టణ సిఐటియు నాయకులు వివి జవహర్లాల్, జెవి రాఘవులు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకష్ణ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కార్యదర్శి షేక్ జానీబాష, నాయకులు ఎం.శివారెడ్డి, బి.ఆంజనేయులు, సిహెచ్ సత్యనారాయణ, డి.శ్రీనివాసరావు, వి.పూర్ణయ్య పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న వీసీ రాజశేఖర్ పట్టేటి

## వర్సిటీలో రేపటి నుండి విద్యా విషయక ప్రదర్శన

**ప్రారంభించనున్న సినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ**

**క్రీడా మైదానంలో బ్రూస్లీ విగ్రహావిష్కరణ**

**ప్రజాశక్తి - మంగళగిరి రూరల్**
అచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈనెల 15 నుండి 17 వరకు విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యా విషయక ప్రదర్శనను నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య రాజశేఖర్ పట్టేటి తెలిపారు.ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి అనేక విశ్వవిద్యాలయాల నుండి,కళాశాలల నుండి, విద్యార్థులు అధ్యాపకులు హాజరవుతున్నారని పేర్కొన్నారు.సినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ అకడమిక్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించనున్నారని, క్రీడా మైదానంలో బ్రూస్లీ విగ్రహావిష్కరణ చేస్తారని తెలిపారు. మరో ముఖ్య అతిధిగా మన రాష్ట్రంలోని ఎస్‌ఆర్‌ఎమ్ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డి. నారాయణరావు పాల్గొంటారని తెలిపారు. స్థానిక పాఠశాలలు,కళాశాలల విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు.ఇంజినీరింగ్ కళాశాలలో తగిన రీతిలో విద్యార్థులు తమ ప్రదర్శనలు ఏర్పాటు చేసుకునేలా అన్ని విధాలుగా స్టాల్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.విద్యార్థులు అధ్యాపకులు వేలాదిగా పాల్గొని విద్యా, శాస్త్ర సాంకేతిక రంగాలలోని విశిష్ట ప్రదర్శనల ద్వారా విజ్ఞానాన్ని నవీన ఆవిష్కరణలను తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తవ్వాలి

ప్రజాశక్తి-నరసరావుపేట

పల్నాడు జిల్లాలో జగనన్న పేదలందరికీ ఇళ్ళు పథకం ద్వారా నిర్మిస్తున్న గృహ నిర్మాణాలకు సంబంధించి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని ఎస్ ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గహ నిర్మాణ శాఖ అధికారులు, మండల పరిషత్ అభివద్ధి అధికారులు, గ్రామీణ నీటి సరఫరా విభాగం, పంచాయతీరాజ్, పట్టణ పేదల అభివద్ధి శాఖ (మెప్మా), జిల్లా గ్రామీణ అభివద్ధి శాఖ (వెలుగు),మున్సిపల్ కమిషనర్ లు తదితర శాఖల అధికారులతో గృహ నిర్మాణాల పనులు, మౌలిక వసతులు కల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జగనన్న కాలనీ లే అవుట్ లలో గహ నిర్మాణాల ప్రగతిని జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. లే అవుట్ లలో సొంతగా గహాలను నిర్మించుకుంటున్న లబ్ధిదారుల పరిస్థితి పై ఆరా తీశారు. గహ నిర్మాణాలలో ఆర్.ఎల్ లెవెల్ నుంచి ఆర్.సి లెవెల్ కు తీసుకురావాలన్నారు. ఆయా స్టేజీలలో ఉన్న ఇళ్ల నిర్మాణాలలో ప్రోగ్రెస్ ను తప్పకుండా తీసుకురావాలని ఆదేశించారు. కాలనీలలో బోర్ల నిర్మాణం, విద్యుత్ పనులు, పైప్ లైన్ ల నిర్మాణం పనులు పూర్తి చేయడంతో పాటు, సమస్యలు ఉన్నచోట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సమా వేశంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ప్రగతి సాధించాలి

పల్నాడు జిల్లాలో సంక్షేమ,అభివద్ధి పథకాలను మరింత వేగవంతంగా అమలు చేసి ప్రగతి సాధించేందుకు అధికారులంతా కషి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సోమవారం ఆయా శాఖల జిల్లా అధికారులతో అంతర్గత అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రధానంగా వెనుకబడిన 10 మండలాల అధికారులతో అనుసరించాల్సిన అంశాలపై క్షుణ్ణంగా మాట్లాడారు.పథకాల అమలులో ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్ ఈ.కె.వై.సి. త్వరిత గతిన చేపట్టాలని సూచించారు. గ్రామ పంచాయతీ లకు చెత్త నుంచి సంపద తయారీ విధానానికి మ్యాపింగ్ చేయాలన్నారు.

సుస్థిర అభివద్ధి కోసం చేప ట్టాల్సిన చర్యలను తప్పని సరిగా పాటిం చాలని ఆదేశించారు. ఆడపిల్లలో ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా పౌష్టిక ఆహారం అందించాలన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

## వీఆర్వోల సంఘం అధ్యక్షునిగా నాగేశ్వరరావు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

పల్నాడు జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షునిగా ఆరుమళ్ళ నాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ వీఆర్వోల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. వీఆర్వో సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన నాగేశ్వరరావుకు కంభంపాడు గ్రామ నాయకులు ఆరికట్ల చంద్రశేఖర్ రెడ్డి, ఫ్రాన్సిస్, వెంకటేశ్వర రెడ్డి , బిట్టు వెంకటేశ్వర్లు ,కలివేల వెంకయ్య, మాధవి, విజయ్, మోషే నాయక్,సౌరీలు,లిఖిత ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి

ప్రజాశక్తి - వినుకొండ

పల్నాడు జిల్లా శాలివాహన సంఘం ఆధ్వర్యంలో తొలి తెలుగు మహిళ కవయిత్రి శ్రీ కుమ్మరి మొల్లమాంబ జయంతి వేడుకలను పట్టణంలోని శాలివాహన సంఘ కార్యాలయంలో సోమవారం పల్నాడు జిల్లా అధ్యక్షులు పారేళ్ళ రమేష్ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పారెళ్ల రమేష్ మాట్లాడుతూ తొలి తెలుగు మహిళ కవయిత్రి మల్లమాంబ 583 వ జయంతి వేడుకలు ప్రతి నియోజకవర్గంలో నిర్వహించడం ఎంతో మంచి పరిణామం అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ శాలివాహన సంఘ అధ్యక్షులు గొట్టం గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి మద్దికుంట ఆదినారాయణ, కోశాధికారి పారెళ్ల లక్ష్మయ్య, వినుకొండ పట్టణ అధ్యక్షులు బొంకూరి రోశయ్య, శాలివాహన సంఘ నాయకులు పాల్గొన్నారు.

## జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఆర్థికసాయం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రోడ్డు ప్రమాదంలో మరణించిన రెండు కుటుంబాలకు జ్ఞానేశ్వర ఫౌండే షన్ చైర్మన్ షేక్ జాన్ సైదా పది వేల రూపాయల చొప్పున మొత్తం రూ.20 వేల ఆర్థిక సహాయంను సోమవారం అందజేశారు. ఇటీవల వినుకొండ మం డలం చీకటిగల పాలెం గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చిలకలూ రిపేట మండలం మురికిపూడి గ్రామా నికి చెందిన పోతురాజు చెంచు, కు ప్పనబోయిన వీరయ్యలు ప్రమా దంలో మరణించా రన్నారు. సోమవా రం వారిని జాన్ సైదా పరామర్శించి ఒక్కొక కుటుంబానికి 10 వేల రూపా యల చొప్పున 20 వేల రూపాయల ఆర్థిక సహాయం వారి హహల వద్ద ఇచ్చినట్లు తెలిపారు. కార్య క్ర మంలో 15వ వార్డు కౌన్సిలర్ జాలా ది సుబ్బారావు, చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, బి వి రెడ్డి, గొంటు శ్రీనివాసరెడ్డి, జమ్ము లమడక ఆదిబాబు, మానుకొండ శేషిరెడ్డి, షేక్ కరిముల్లా, నకరికంటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారునికి టిప్పర్ లారీ తాళాలు అందజేస్తున్న జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్

## 'నవోదయం'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-నరసరావుపేట

నవోదయం కార్యక్రమాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లాలో అర్హత కలిగిన పేదలు ప్రభుత్వం అందిస్తున్న సహకారం తో జీవన విధానంలో మార్పు రావాలని ఆకాంక్షిన్నట్లు జిల్లా కలెక్టర్ శివ పేర్కొన్నారు. పల్నాడు జిల్లాలో "నవోదయం" జగనన్న బడుగు వికాసం పథకం ద్వారా అర్హత కలిగిన ప్రజలకు ఉపాధిని కల్పించి, ఆర్థిక సహకారం అందించే కార్యక్రమానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం జగనన్న బడుగు వికాసం కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సహకారం తో పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం, గుండాలపాడు గ్రామానికి చెందిన కంభం పాటి బాలయ్య గత నెల ఫిబ్రవరిలో "నవోదయం" జగనన్న బడుగు వికాసం పథకం ద్వారా "టిప్పర్ వాహనం" కోసం ధరఖాస్తు చేసుకున్నారు. కలెక్టర్ చొరవతో రూ.54 లక్షల విలువ చేసే "టిప్పర్ వాహనాన్ని బ్యాంకు ద్వారా తగిన రుణం పొంది, 45 శాతం ప్రభుత్వ రాయితీ తో లబ్ధిదారునికి లభించిందని నవోదయం నోడల్ అధికారి సంజీవరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంఘీక సంక్షేమ శాఖ అధికారి ఓబులు నాయుడు, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వర్లు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వెంకటేశ్వరరావు,నవోదయం నోడల్ అధికారి సంగీత రావు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ల్యాబ్ టెక్నీషియన్ దినోత్సవం

ప్రజాశక్తి-బెల్లంకొండ



మండలంలోని చంద్రాజుపాలెంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ దినోత్సవం సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్ కేతావత్ రమేష్ నాయక్ ను ప్రభుత్వం వైద్యాధికారి కె వి కోటేశ్వరరావు, సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె వి కోటేశ్వరరావు మాట్లాడుతూ వైద్యవిభాగంలో ల్యాబ్ టెక్నీషియన్ పాత్ర కీలకమైనదిని వివిధ రకాల వ్యాధులు కనిపెట్టడానికి వ్యాధులకు తీవ్రతను తెలుసుకోవడానికి ల్యాబ్ టెక్నీషియన్ ఎంతో కషి వాళ్ళ సేవలు వెలకట్టలేనిదని డాక్టర్ కోటేశ్వరరావు అన్నారు. డాక్టర్ కె వి కోటేశ్వరరావు, సూపర్వైజర్ శిఖా శాంసన్, సి హెచ్ ఓ మణి కుమారి, శ్రీనివాసరావు, యమ్ పి హెచ్ఎ రమేష్ బాబు, ఫార్మసిస్ట్ శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 'గీతమ్స్'లో వీడ్కోలు సభ

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక గీతమ్స్ పాఠశాలలో10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథులుగా స్థానిక శాసన సభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ శాసన సభ్యులు జీవి ఆంజనేయులు పాల్గొన్నారు. వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అలవరచుకోవాలని, క్రమశిక్షణతో కలిగిన విద్యవలన ఉన్నత శిఖరాలు అధిరోహించ వచ్చని, పరీక్షల సమయంలో సమయపాలన ఎంత ముఖ్యమో వివరిస్తూ, జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదిగి వినుకొండకు మంచి పేరు తీసుకురావాలని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. చదువుతో పాటు వివిధ నైపుణ్యాలను కూడా అలవరచుకోవాలని. అన్ని రంగాలలో ప్రావీణ్యం సాధిం చాలని సూచించారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో సెక్రటరీ, కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి వినుకొండ మార్కెట్ యార్డు చైర్మన్ గంధం బాలిరెడ్డి, మునిసిపల్ చైర్మన్ సతీమణి షకీలా, మండల విద్యాశాఖ అధికారి, సయ్యద్ జఫుల్లా , ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మావతి, పివి సురేష్ , సాధాగర్ జానీ, పాఠశాల ప్రిన్సిపాల్. ఎం.కృష్ణవేణి , ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ మోసాలపై ఆర్‌బిఐ ఆధ్వర్యంలో కళాజాత

**ప్రజాశక్తి-విజయపురిసౌత్ :**రిజర్వ్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ కర్నూల్ వారి సహకారంతో' ఆర్థిక అక్షరాస్యత కేంద్రం మాచర్ల వారి ఆధ్వర్యంలో మాచర్ల మండలంలోని బెల్లంకొండ వారి పాలెం గ్రామంలో ఆదివారం రాత్రి బ్యాంకింగ్ పథకాలపై రాంబాబు కళాజాత బందం వివిధ పాటలు కళలు ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో' ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్ మాదాసు రాజబాబు మాట్లాడుతూ సైబర్ నేరాలు పెరిగిన నేపథ్యంలో వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు సైబర్ క్రైమ్ ఆఫీస్ టోల్ ఫ్రీ నెంబర్ 19 30 నెంబర్ కు మూడు రోజుల్లో తెలియజేయాలని కోరారు.కళాకారులు టీమ్ లీడర్ మాగులూరి రాంబాబు, పులిమెల భాస్కరరావు, యలకపాటి శ్రీనివాసరావు ప్రదర్శించిన కళలు ఆకట్టుకున్నాయి.

## జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాశక్తి-ఈపూరు:** సీజనల్ వ్యాధులు టైఫాయిడ్,డెంగ్యూ, మలేరియా జ్వరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యురాలు సిహెచ్ శ్రీ వెన్నెల అన్నారు. మండలంలోని అగ్నిగుండాలలో సోమవారం అరబిందో ఈఎంఎస్, ఏపీఎస్ఏ సిఎస్ లింక్ వర్కర్ స్కీం సహకారంతో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామాల్లోని ప్రజలకు బిపి,షుగర్,థైరాయిడ్ గర్భిణిలకు రక్త పరీక్షలు, గుండెకు సంబంధించిన ఈసీజీ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పి రమణనాయక్, లింక్ వర్కర్ స్కీమ్ సూపర్‌వైజర్ విశ్వేశ్వరరావు, పంచాయతి కార్యదర్శి అరుణ,ఏఎన్ఎం శాంతి బాయి, ఆశ వర్కర్స్, లింక్ వర్కర్ మున్యా నాయక్ పాల్గొన్నారు.

# 21న డిఎంహెచ్ఓ కార్యాలయం వద్ద ఆశాల ధర్నా

ప్రజాశక్తి - తుళ్లూరు

ఆశ వర్కర్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మార్చి 21న గుంటూరు డిఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ఆశ వర్కర్లు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ రాజధాని కార్యదర్శి రెబకా, సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం రవి కోరారు .ఈ మేరకు సోమవారం తుళ్లూరు పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్‌కు ఆశాల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆశా వర్కర్స్ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు.జాబ్ చార్ట్‌తో సంబంధం లేని పనులు ఆశా వర్కర్స్‌తో చేయించరాదని, వారిపై పని భారం తగ్గించాలని కోరారు. ఆశా వర్కర్స్‌కు ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవులు,వేతనంతో కూడిన మెటర్నిటీ లీవ్‌లు, వారాంతపు సెలవులు, క్యాజువల్ లీవ్ లు ఇవ్వాలన్నారు.రిటైర్మెంట్ సందర్భంగా రూ. 5 లక్షల గ్రాట్యుటీ , జీతంలో సగం పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఆశా వర్కర్స్‌కు రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని,రూ10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు.ఎఎన్ఎం,హెల్త్ సెక్రటరీల నియమాకాల్లో అర్హులైన ఆశాలకు వెయిటేజ్ ఇవ్వాలని కోరారు.విధి నిర్వహణలో మరణించిన ఆశా వర్కర్ కుటుంబ సభ్యులకు ఆశా వర్కర్స్ నియమాకాలలో ప్రాధాన్యత ఇవ్వాలని, విలేజ్ హెల్త్ క్లినిక్, సచివాలయాల్లో ఆశా వర్కర్లతో డ్యూటీ చేయించరాదని, ఆశా వర్కర్స్ నిర్వహించాల్సిన రికార్డులు ప్రభుత్వమే ఇవ్వాలని,104 ఉద్యోగుల కోసం ఆశా వర్కర్స్‌తో ఎలాంటి అదనపు ఖర్చులు చేయించరాదని కోరారు. పై డిమాండ్ల సాధన కోసం 21వ తేదీన గుంటూరుడి ఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ఆశాలందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

వైద్యాధికారి శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎం రవి,ఆశ వర్కర్స్

ప్రదర్శనలను తిలకిస్తున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శికుమార్

## జెఎంజెలో వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక జెఎంజే మహిళా కళాశాల్లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సోమవారం ప్రారంభించారు. ప్రిన్సిపల్ సిస్టర్ షైనీ అధ్యక్షతన జరిగిన ప్రదర్శనలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఇలాంటి ప్రదర్శనలు దోహదం చేస్తాయన్నారు. వివిద పాఠ్యాంశాలపై విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న అంగలకుదురు జెడ్పీహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయిని రోజ్‌ల్యాండ్ మాట్లాడుతూ ప్రదర్శనలు విద్యార్థుల సృజనకు అద్దంపట్టాయన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ థెరేసమ్మ, కన్వీనర్ ఎం.అరుణ, అధ్యాపక, అద్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

చెక్కబల్లబండిని అందజేస్తున్న టిడిపి నాయకులు

## చిరువ్యాపారికి చెక్కబల్ల బండి అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఏంటీఎంసీ పరిధిలోని ప్రాతూరుకు చెందిన డోకిపర్తి ఏసుబాబుకు వ్యాపారం చేసుకునేందుకు చెక్కబల్లబండిని టిడిపి నాయకులు సోమవారం అందజేశారు. తనకు చెక్కబల్ల బండి కావాలని అర్జీ పెట్టుకున్న వెంటనే టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ సహాయం చేయడం పట్ల డోకుపర్తి ఏసుబాబు టిడిపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమర సుబ్బారావు, ప్రాతూరు గ్రామ అధ్యక్షులు అరవపల్లి శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి ప్రాతూరు రాజేష్, చొక్కా ఫ్రాన్సిస్, పాటిబండ్ల సాంబశివరావు, ఎన్. బ్రిడ్జిరాజ్, నల్లపు చిన్ని తఉన్నారు.

బొమ్మదేవర వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న సంఘం నాయకులు

## లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యులు బొమ్మదేవరకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలి: ప్రముఖ సామాజిక కార్యకర్త, పట్టణ పరిసరప్రాంత అభివృద్ధి సంఘం, పెన్షనర్స్ అసోసియేషన్ తెనాలి యూనిట్ ప్రధాన కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు ఇటీవల మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం అధ్యక్షులు దరిశి శివకోటేశ్వరరావు ఆద్వర్యంలో సోమవారం వెంకటేశ్వరరావను సత్కరించారు. ఏపిఎన్జీవోస్ అసో సియేషన్, పెన్షనర్స్ అసోసియేషన్, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మాజీ సైనికోధ్యోగుల సంక్షేమ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## 19న కొల్లిపరలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మార్చి 19న కొల్లిపరలో జరిగే అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రజలు వేలాదిగా తరలి రావాలని ఒకటో వార్డ్ కౌన్సిలర్ గెడ్డటి సురేంద్ర పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక బస్టాండ్ కూడలివద్ద మమత హెూటల్లో కొల్లిపర అంబేద్కర్ యువజన సమైక్య యువకులతో కలసి అంబేద్కర్ విగ్రహావిష్కరణ వివరాలు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన బిసి సంక్షేమ సంగం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు అంబేద్కర్ విగ్రవిష్కరణ కరపత్రాలు, గోడపత్రాలను ఆవిష్కరించి అంబేద్కర్ అభ్యుదయవాదులకు అందించారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ నిలువెత్తు విగ్రహావిష్కరణలో ప్రతి పౌరుడు పాల్గొనాలని తెనాలి యువతకు సురేంద్ర పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఆశయసాధనలో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్న విసికె పార్టీ జాతీయ అధ్యక్షులు, తమిళనాడు రాష్ట్ర చిదంబరం పార్లమెంట్ సభ్యులు తిరుమావలవన్ విగ్రహావిష్కరణకు వస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పిల్లి విజయభాస్కర్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంబేద్కర్ చైర్ కనపర్తి అబ్రహం లింకన్, ఎస్సి, ఎస్టీ, బిసి, మైనార్టీ ఐక్యవేదిక వ్యవస్థాపకులు అక్కిదాసు కిరణ్ కుమార్, సొపాటి కిరణ్, రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావల్తు ప్రసంగించారు. కుల మతాలకు అతీతంగా అంబేద్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొనడానికి చలో కొల్లిపరను విజయవంతం చేయాలని కోరారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేసన శంకరరావు , తదితరులు

# సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం

- యువజన సర్వీసుల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి డాక్టర్ వాణీమోహన్
- ఎస్ఆర్ఎంలో ఘనంగా ముగిసిన మహిళా దినోత్సవం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడా సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, సీనియర్ ఐఎఎస్ అధికారిణి డాక్టర్ జీ వాణీమోహన్ అన్నారు. సోమవారం మధ్యాహ్నం ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో మహిళా దినోత్సవాల ముగింపు వేడుకలకు డాక్టర్ వాణీమోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వేడుకల కన్వీనర్ డాక్టర్ లక్ష్మీరాజ్యం అధ్యక్షతన జరిగిన సభలో వాణీమోహన్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నేడు అనేక రంగాల్లో మహిళలు అభివృద్ధిని సాధిస్తున్నారన్నారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరా మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు ప్రగతి సాధిస్తున్నారన్నారు. యూనివర్సిటీలోని మహిళా ఉద్యోగులందరికీ డిజిటల్ నాలెడ్జిను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రో వైస్ ఛాన్సలర్ ఆచార్య డి నారాయణరావు మాట్లాడుతూ యూనివర్సిటీలో సెంటర్ ఫర్ స్పోర్ట్స్ సైన్సును ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర క్రీడా మరియు యువజన సర్వీసుల శాఖ ముందుకు రావాలని కోరారు. ఐజీకార్ రీసెర్చ్ హెడ్ డాక్టర్ విద్యా సుందరరాజన్, మంగళగిరి ఎయిమ్స్ డీన్ డాక్టర్. దీప్తిలు కూడా ప్రసంగించారు. కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ లక్ష్మీరాజ్యం వారోత్సవాల నివేదికను సమర్పించారు. .ఆయా గ్రామాల్లో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాల నిర్వహణకు సహకరించిన ఐజీకార్, ఎయిమ్స్ వైద్యులు, సిబ్బందికి జ్ఞాపికలను ప్రదానం చేశారు. నీరుకొండలో వైద్య శిబిరం నిర్వహణకు అన్ని విధాలా సహకారం అందించిన మాదల శ్రీనివాసరావును సత్కరించి జ్ఞాపికను ప్రదానంచేశారు.ఈ సందర్భంగా వీఎస్ రావు ఫౌండేషన్ తరపున 8 మంది శ్రామిక మహిళలకు ఉత్తమ మహిళా ప్రతిభా అవార్డులను ప్రదానం చేశారు. శీలం శాంతి, కట్టెపోగు శిరీష, పి భార్గవి, పాలకాయల సుజాత, కావూరి నాగలక్ష్మి, కేవీ శ్రీలక్ష్మి, తాళ్లూరి బుజ్జి, పురపాటి పద్మావతిలు అవార్డులు అందుకున్న వారిలో ఉన్నారు. అవార్డు కింద ఒక్కొక్కరికీ రూ. 2 వేల నగదు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్ కుమార్, కార్యక్రమ నిర్వాహణ కమిటీ కో-కన్వీనర్ డాక్టర్ సునీత, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ మారం పార్థసారథి, డైరెక్టర్లు అనూప్ సింగ్ సూర్యవంశీ, మనీష్ కుమార్, అనిల్ నిగమ్, పంకజ్ బల్వేరియా తదితరులు పాల్గొన్నారు.

వాణీమోహన్‌ను సత్కరిస్తున్న నిర్వాహణ కమిటీ సభ్యులు

దివాకర్‌ను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

## రేడియో ఆర్టిస్ట్ దివాకర్‌కు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణానికి చెందిన పౌరాణిక కళాకారుడు, ప్రముఖ రేడియో ఆర్టిస్ట్ ఇందుపల్లి దివాకర్‌ను సత్కరించారు. స్థానిక బోస్-రోడ్డులోని పెమ్మసాని థియేటర్‌లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారధ్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో ఎన్టీఆర్ నటించిన ఆటగాడు చిత్రాన్ని ఉచింతంగా ప్రదర్శించారు. కళాకారుల సత్కారాల్లో భాగంగా ధివాకర్‌ను సత్కరించి, షీల్డును బహూకరించారు. కార్యక్రమంలో మువ్వా డేవిడ్, పి. చంద్రశేఖర్, సీహెచ్ రాజేంద్రప్రసాద్, కె. రమేష్, శ్రీకరరావు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, పి. పోతురాజు పాల్గొన్నారు.

## ఉగాది బాలోత్సవ బోచర్ల పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణంలోని సుందరయ్యనగర్‌లోని వివిధ అపార్టుమెంట్లతో పాటు పాఠశాలల్లో ఉగాది బాలోత్సవం కరపత్రాలు సోమవారం పంపిణీ చేశారు. తాడేపల్లిలో ఉన్న బహుళ అంతస్తుల భవనాల్లో ఇప్పటికే ఒక దఫా బాలోత్సవ బ్రోచర్లు పంపిణీ కార్యక్రమం పూర్తయింది. ఆయా అపార్టుమెంట్ల ప్రెసెడెంట్లు, సెక్రటరీలను నుండి సానుకూల స్పందన వ్యక్తమవుతోందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాన్ని బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, కొట్టే కరుణాకర్‌రావు, పి.శ్రీలక్ష్మి, ఎ.సుధాకర్ పర్యవేక్షించారు.

ఎమ్మెల్యేను సత్కరిస్తున్న బిషన్ సుధీర్‌కుమార్ తదితరులు

## ఎమ్మెల్యేకు ఈరే మినిస్ట్రీస్ సత్కారం

ప్రజాశక్తి-తెనాలి

ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెనాలి వచ్చిన సందర్భంగా సమాధులకు స్థలాలు లేక క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, నిధుల మంజూరుకు హామీ తీసుకున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకమార్‌ను సోమవారం ఈరే మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సత్కరించారు. స్థానిక ఈరే మినిస్ట్రీస్ కార్యాలంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెద్దఎత్తున తెనాలి పాస్టర్స్ అండ్ గాస్పల్ వర్కర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిషప్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ ఎంతో కాలంగా క్రైస్తవులు స్మశాన స్థలాల కోసం ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈనేపథ్యంలో నేరుగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళిన ఎమ్మెల్యే ఎంతో అభినందనీయులన్నారు. కార్యక్రమంలో సంతోషకుమారి, పాస్టర్స్ బివి సర్వోన్నతరావు, డేవిడ్, గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ సుజాత, భానుప్రసాద్, ఇమ్మానుయేలు దాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలో ప్రదర్శన చేస్తున్న పంచాయతీ కార్మికులు, నాయకులు

# పంచాయతీ కార్మికుల ఆకలి పోరు

**ప్రజాశక్తి-ఫిరంగిపురం**

తకు బకాయి ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని, జీతాలు ప్రతినెలా ఇవ్వడంతోపాటు టెండరు విధానాన్ని రద్దు చేసి కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రమైన ఫిరంగిపురంలోని పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు సోమవారం 'ఆకలిపోరు' చేపట్టారు. ఈ మేరకు ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శిబిరాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు ప్రభుత్వమే రూ.10 వేల జీతం ఇవ్వాలన్నారు. కార్మికులకు వారాంతపు సెలవులు, యూనిఫారం, సబ్బులు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రావిడెంట్ ఫండ్, ఇఎస్ఐ అమలు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. వైసిపి తన ఎన్నికల మేనిఫెస్టోలో కార్మికులకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. మండలంలో 150 మంది కార్మికులు ఉండగా 100 మంది రూ.పదివేల లోపేజ జీతం తీసుకుంటున్నారని, అదీనూ 3-8 నెలల బకాయిలు ఉన్నాయని విమర్శించారు. గ్రీన్ అంబాసిడర్లకు ఇప్పటి వరకు జీతాలను కేంద్రం ఇచ్చినా ఇప్పుడు చేతులెత్తేసిందని, ఈ భారం పంచాయతీలు భరించలేవని, రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి ఎస్కె మస్తాన్‌వలి మాట్లాడుతూ సమస్యలపై అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందించ లేదని, అనివార్య స్థితిలో ఆందోళనకు దిగిన కార్మికులకు ప్రజలంతా మద్దతుగా నిలవాలని కోఆరరు. ఈ సందర్భంగా శిబిరం నుండి గ్రామంలోని ప్రదర్శన చేశారు. యూనియన్ మండల అధ్యక్షులు సిహెచ్ రామారావు, నాయకులు, జోజిబాబు, శ్రావణకుమార్, హానోక్, కె.వెంకయ్య, డి.సాంబయ్య, ఏసుదాసు, డి.శ్రీనివాసరావు, పి.వెంకట్రావు పాల్గొన్నారు.

# జీతం కోసం ప్రతిసారీ పోరాటమే

తుళ్లూరులో నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

- కార్మికుల కుటుంబాలు ఎలా గడవాలి?
- సూపర్‌వైజర్లు బెదిరింపులు మానుకోవాలి
- రాజధాని పారిశుధ్య కార్మికుల నిరసన

**ప్రజాశక్తి - తుళ్లూరు**

పెండింగ్ జీతాల, ఇతర సమస్యల పరిష్కారం కోసం రాజధాని పారిశుధ్య కార్మికులు ఆందోళన చేపట్టారు. స్థానిక పంచాంయతీ కార్యాలయం వద్ద మహాత్మా గాంధీ విగ్రహం ఎదుట సోమవారం పని విరామ సమయంలో నిరసన తెలిపారు. రాజధాని ఏరియా పారిశుధ్య కార్మికుల సంఘం గౌరవాధ్యక్షులు ఎం.రవి మాట్లాడుతూ మూడో నెల గడుస్తున్నా కార్మికులకు జీతాలు చెల్లించలేదని, వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు? పైగా కొంతమంది సూపర్‌వైజర్లు తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నారు. పరుష పదజాలంతో బెదిరింపులకు దిగుతున్నారని అన్నారు. గతంలో 29 గ్రామాల్లో 425 మంది కార్మికులు ఉండగా వేధింపులు, ఆరోగ్య సమస్యల వల్ల 125 మంది మనేశారని, ప్రస్తుతం 300 మందే పని చేస్తున్నారని తెలిపారు. అయినా కార్మికులు ఎక్కువగా ఉన్నారంటూ ఇతర గ్రామాలకు పంపుతున్నారని, ఛార్జీలనూ కార్మికులే భరించాల్సి వస్తోందని, వెళ్లకుంటే తీసేస్తామంటూ సూపర్‌వైజర్లు బెదిరిస్తున్నారని మండిపడ్డారు. ఈసారి ఇలా బెదిరిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. పారిశుధ్య కార్మికులకు నెలకు రూ.15 వేల జీతం, రూ.6 వేలు మెడికల్ అలవెన్స్ కలిపి రూ.21 వేలు ఇస్తుండగా రాజధానిలో మాత్రం రూ.12 వేలే ఇస్తున్నారని, అదికూడా నెలల తరబడి పెండింగ్ పెడుతున్నారని విమర్శించారు. జీతాల కోసం ప్రతిసారీ ఆందోళన చేయాల్సి వస్తోందని, పిఎఫ్ చెల్లించడం లేదని, ఇఎస్ఐ కార్డుల్వీలేదని వీటికి డబ్బులు మాత్రం కట్ చేసుకుంటున్నారని విమర్శించారు. వీటన్నింటికి తోడూ వారానికో షరతు, నిబంధనలు పెడుతూ వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. వీటన్నింటిపై ప్రభుత్వం, అధికారులు స్పందించకుంటే దశలవారీ ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

## పొరుగూరులో పనిచేస్తూ పడిపోయిన కార్మికురాలు

అనంతవరానికి చెందిన సునీతతోపాటు నలుగురు కార్మికులను సోమవారం ఉదయం సూపర్‌వైజర్ మన్మధరావు దొండపాడు బైపాస్ రోడ్డుపై పనికి పంపించారు. పనిచేస్తున్న క్రమంలో ఎండ తీవ్రతకు తాళలేక సునీత స్పృహతప్పి పడిపోయారు. అక్కడివారు గమనించి ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించడంతో కోలుకున్నారు. సునీత అస్వస్థతకు గురైన విషయాన్ని సూపర్‌వైజర్‌కు సమాచారం ఇవ్వగా ఆటోలో ఇంటికి తీసుకెళ్లి ఇంటి దగ్గర వదిలేయాలంటూ నిర్లక్ష్యంగా సలహా ఇచ్చారని ఇతర కార్మికులు వాపోయారు. ఇతర గ్రామాలకు పనికి పంపించడాన్ని, నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని కార్మికులు, ఎం.రవి ఖండించారు. కార్మికులను బానిసలుకంటే హీనంగా చూస్తున్నారని, వారి ప్రాణాలంటే లెక్కే లేకుండా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బాధితురాలు సునీతను పరామర్శించారు.

## బిల్లు కోసం వాటర్ స్కీమ్‌కు కరెంటు కట్

**ప్రజాశక్తి - మంగళగిరి**

స్థానిక టిడ్కో గృహ సముదాయంలో ఉన్న వాటర్ పంపింగ్ స్కీం విద్యుత్ బిల్లు చెల్లించలేదంటూ విద్యుత్ సరఫరాను అధికారులు సోమవారం కట్ చేశారు. దీంతో గృహ సముదాయంలోని కుటుంబాలు తాగునీటికి ఇబ్బంది ఎదురైంది. ఈ పంపింగ్ స్కీమ్ విద్యుత్ బిల్లును ఎపిఐఐసి చెల్లించాల్సి ఉందని భావించి అధికారులు సరఫరాను నిలిపేశారు. అయితే ఈ స్కీమ్‌ను కార్పొరేషన్‌కు గతంలోనే ఎపిఐఐసి అప్పగించినట్లు తర్వాత తెలిసింది. బిల్లును మంగళవారం చెల్లిస్తామని కార్పొరేషన్ అధికారులు చెప్పడంతో విద్యుత్‌ను పునరుద్ధరించారు.

## పవర్ లిఫ్టింగ్‌లో జిల్లాకు ఐదు పతకాలు

**ప్రజాశక్తి - మంగళగిరి**

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఈనెల 11, 12 తేదీల్లో నిర్వహించిన 10వ రాష్ట్రస్థాయి క్లాసిక్ మెన్ అండ్ ఉమెన్ బెంచ్ ప్రెస్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో గుంటూరు జిల్లా లిఫ్టర్లు ఐదు పతకాలు సాధించారని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి జి.పుల్లేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు పతకాలు సాధించిన వారిని సోమవారం అభినందించారు. మహిళల విభాగంలో 84 ప్లస్ కేజీల విభాగంలో బి.చంద్రిక స్కాట్ 175 కిలోలు, బెంచ్ ప్రెస్ 72.5 కిలోలు, డెడ్ లిఫ్ట్ 172.5 కిలోలు మొత్తం 420 కిలోలు బరువును ఎత్తి బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టైటిల్ కైవసం చేసుకున్నట్లు తెలిపారు. వి.రేవతి 67.5 కిలోల విభాగంలో బంగారు పతకం, పురుషులు 59 కిలోల విభాగంలో సిహెచ్ రమేష్ బంగారు పతకం, 66 కిలోల విభాగంలో బి.రామకృష్ణ కాంస్య పతకం, 74 కిలోల విభాగంలో కె.నరసింహారావు కాంస్య పతకం సాధించారని వివరించారు. మొత్తంగా 3 బంగారు పతకాలు, రెండు కాంస్య పతకాలు సాధించరన్నారు. వీరిని కోచ్‌లు షేక్ సందాని, సయ్యద్ మస్తాన్‌వలి అభినందించారు.

# నేడు నులిపురుగుల నివారణ దినం

సమీక్షలో మాట్లాడుతున్న పల్నాడు కలెక్టర్ శివశంకర్

### సమర్థవంతంగా పని చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశం

**ప్రజాశక్తి - నరసరావుపేట**

ఏడాదికి రెండు సార్లు జరిగే జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని ఈ ఏడాది మొదట దఫా మంగళవారం నిర్వహించనున్న నేపథ్యంలో పల్నాడు జిల్లాలో సిబ్బంది సమర్థవంతంగా పని చేయాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. ఈ అంశంపై కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ 1-19 ఏళ్ల వారికి ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయాలని, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లోని 4,21,127 మందిని ఇప్పటికే గుర్తించామని చెప్పారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ శోభారాణి మాట్లాడుతూ మాత్రల పంపిణీలో వైద్యసిబ్బందికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖాధికారులు సహకరించాలని కోరారు. ట్యాబెట్లు వేసుకుంటే సమస్యలేమీ రావని, 11 ఏళ్లుగా ఈ కార్యక్రమం జరుగుతున్నా ఎవరికీ ఇబ్బంది రాలేదని చెప్పారు. మంగళవారం మాత్రలు వేసుకోని వారికి 18వ తేదీన మరోసారి వేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ చంద్రశేఖర్, ఐసిడిఎస్ పీడీ అరుణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నిర్మూలనపై భాష్యంలో అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కీర్తి

**ప్రజాశక్తి-గుంటూరు**

జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నులిపురుగుల నిర్మూలన మాత్రలను పంపిణీ చేస్తామని ఆర్‌బిఎస్‌కె మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.కీర్తి తెలిపారు. 1-19 ఏళ్ల వారందరూ ఈ మాత్రలను తీసుకునేలా చూడాలని కోరారు. సోమవారం స్థానిక భాష్యం మెయిన్ క్యాంపస్‌లో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ చేతుల ద్వారా ఎన్నో క్రిములు మన శరీరంలోకి ప్రవేశించి, మనల్ని రోగాల బారిన పడేస్తాయన్నారు. కావున చేతుల్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యక్తిగత శుభ్రత, జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండటం వల్ల నులిపురుగులను నివారించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో మెయిన్ క్యాంపస్ ప్రిన్సిపాల్ కృష్ణకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## కిట్స్ అధ్యాపకురాలికి యంగ్ సైంటిస్ట్ అవార్డు

**ప్రజాశక్తి-గుంటూరు**

అధ్యాపకురాలిని అభినందిస్తున్న ఛైర్మన్ కోయి సుబ్బారావు

కిట్స్ కాలేజిలోని సైన్స్ అండ్ హ్యుమానిటీస్ విభాగానికి చెందిన డాక్టర్ భాగ్య లక్ష్మి కొత్తూరుకి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ ఎ ప్రీమియర్ ఆర్గనైజేషన్ ఇన్ ఇండియా వారు గణిత శాస్త్రంలో చేసిన పరిశోధనకుగాను యంగ్ సైంటిస్ట్ అవార్డును ప్రదానం చేశారని కళాశాల ఛైర్మన్ కోయి సుబ్బారావు తెలిపారు. తమ కళాశాలలో పరిశోధనలకు ప్రాధాన్యం ఇస్తున్నామని, అధ్యాపకులే కాక విద్యార్థులూ నూతన ఆవిష్కరణల దిశగా కృషి చేసేందుకు ప్రత్యేకంగా కళాశాలలో పరిశోధనా విభాగం అన్ని విధాలుగా కృషి చేస్తుందని చెప్పారు. భాగ్యలక్ష్మిని ఛైర్మన్ సుబ్బారావు, సెక్రెటరీ కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, ఎస్ఎహెచ్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం.బసవేశ్వరరావు అభినందించారు.

## అభ్యుదయ కాలేజి విద్యార్థినులకు ఉద్యోగాలు

**ప్రజాశక్తి-గుంటూరు**

స్థానిక అభ్యుదయ మహిళా డిగ్రీ కాలేజీలో ఐఎల్ఎం సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 50 మంది ఉద్యోగార్హత సాధించారని డైరెక్టర్లు బిఎస్ఆర్‌కె ప్రసాద్, ప్రిన్సిపాల్ బి.రోహిణిదేవి తెలిపారు. మొత్తం 120 మంది ప్రాంగణ ఎంపికలకు హాజరు కాగా మొదటి రౌండ్‌లో 80 మంది, తర్వాత రౌండ్‌లో 50 మంది అర్హత సాధించి, ఉద్యోగాలకు ఎంపికయ్యారని అభినందించారు.

ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులతో యాజమాన్యం